సమావేశము – VII
వాల్యూము – I
నెం. 3

వెల : రూ. 19–00
15 మార్చి, 2017
బుధవారం,
(శక సం. 1938,
ఫాల్గుణం – 24)

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

## అధికార నివేదిక

<u>విషయ సూచిక</u>

1. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు ... 1

2. సభా కార్యక్రమము : ... 15
వాయిదా తీర్మానాల అనుమతి గురించి

3. ప్రకటన : ... 15
కొత్త తీర్మానాల స్వీకరణ గురించి

4. 2017 – 2018 సంవత్సరపు వార్షిక ఆదాయ–వ్యయ పట్టిక (బడ్జెట్)పై – సాధారణ చర్చ (మొదటి రోజు) ... 15

# తెలంగాణ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ ఎస్. మధుసూదనాచారి |
| ఉప సభాపతి | : | శ్రీమతి ఎం. పద్మా దేవేందర్ రెడ్డి |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా.వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్ |
| | | శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్ |
| | | శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి. ఎన్. ప్రసన్న కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

## ( ఏడవ సమావేశము – మూడవ రోజు)

---

## బుధవారం, మార్చి 15, 2017

---

**(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)**

**(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)**

### నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

MR. SPEAKER:- Please resume your seats. Question No. 1(2449)

### నవజాత శిశువులకు బేబి కిట్లు

ప్రశ్న నెం.1(2449)

శ్రీమతి అజ్మీరా రేఖ (ఖానాపూర్), సర్వశ్రీ రవీంద్రకుమార్ రమావత్ (దేవరకొండ), బానోత్ మదన్‌లాల్ (వైరా) – గౌరవనీయులైన వైద్య మరియు ఆరోగ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ. గిరిజన ప్రాంతాలలో నవజాత శిశువులకు బేబి కిట్లను సమకూర్చాలనే ప్రతిపాదన ఏదైనా ఉందా?

ఆ. అయితే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో దీని అమలు విధి విధానాలు ఏమిటి?

వైద్య ఆరోగ్య శాఖమంత్రి (డా. సి. లక్ష్మారెడ్డి): – అ. అవునండీ. రాష్ట్రమంతటా అమ్మఒడి కిట్‌ను తల్లి , బిడ్డకు సమకూర్చాలనే ప్రతిపాదన ఉంది.

ఆ. రాష్ట్రమంతటా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ప్రసవించిన మహిళలందరికి అమ్మఒడి కిట్‌ను సమకూర్చడం అవుతుంది. ఈ కిట్‌లో శిశువులకు ఉపయోగపడే పదకొండు వస్తువులు, తల్లులకు ఉపయోగపడే నాలుగు వస్తువులు ఉంటాయి. ప్రతి కిట్ ధర సమారు రూ.2000 ల వరకు ఉంటుంది.

**శ్రీమతి కె. అజ్మీరా రేఖ:–** ఈరోజు నాకు అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు. నవజాత శిశువుకు కేసీఆర్ కిట్ ఇవ్వడం అనేది చాలా అదృష్టంగా భావిస్తున్నాను. నా నియోజక వర్గంలోని పెమ్మి మండలంలో అందరూ గిరిజనులే ఉంటారు. మిషన్ భగీరథలో భాగంగా వాటర్ గ్రిడ్ ఇనాగరేషన్ గురించి ఇంద్రకరణ్ రెడ్డిగారు మా నియోజకవర్గానికి వచ్చారు. వారు రావడం కొంత ఆలస్యమైంది. ఆ సమయంలో కొంతమంది మహిళలు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్ నాతో మాట్లాడారు.

మా గిరిజనులలో డెలివరీలు ఇంటిలోనే చేస్తారు, హాస్పిటల్‌కు తీసుకువెళ్లరు. కాని ఇప్పుడు హాస్పిటల్‌కు వెళితే ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని వారికి చెప్పాను. వివిధ రకాలైన వస్తువులు పుట్టిన బిడ్డకు అమ్మఒడి పేరున కిట్ ఇస్తారని ఆ పథకం గురించి చెప్పడంతో ఒక మహిళ అమ్మఒడి అంటే ఏమిటని అడిగింది. హాస్పిటల్‌లో డెలివరీ చేయిస్తే మూడు విడతలలో రూ.12వేలు ఇస్తారని, అమ్మాయి పుడితే రూ.1000లు అదనంగా ఇస్తారని, పుట్టిన శిశువు కోసం "కేసీఆర్ కిట్" అని పదిహేను వస్తువులు వారికి అందిస్తారని నేను చెప్పడం జరిగింది. అప్పుడామె తాము డెలివరీ అయిన సమయంలో కేసీఆర్ సార్ ఉంటే బాగుండేదని అన్నది. తనకు ముగ్గురు పిల్లలు ఇంటిలోనే పుట్టారని వారికి సరైన వైద్య సదుపాయం అందక ముగ్గురు పిల్లలు పుట్టి చనిపోయారని ఆమె చెప్పింది. ఆ మాటలు వింటే నాకు చాలా బాధ వేసింది. నాలుగు సంవత్సరాల క్రితం మా ఊరి దగ్గర రోడ్లు లేవు. మాకోసం రోడ్లు వేశారు. హాస్పిటల్‌లో పుట్టిన పిల్లలను ఇంటికి తీసుకురావడానికి అంబులెన్స్‌లు పెట్టడం వల్ల మా నియోజక వర్గ ప్రజలంతా చాలా సంతోషంగా ఉన్నారు. మాకు ఆ సౌకర్యాలు కల్పించినందుకు ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

తరువాత ఒక మైనారిటీ మహిళ నాతో మాట్లాడింది.

[illegible]

[illegible]

చాలా మంచి స్కీమ్స్ తెచ్చారు. ఆమె కళ్యాణ లక్ష్మి స్కీమ్ ద్వారా తన బిడ్డ పెండ్లి జరిపించింది.

اس کے کہا کہ مجھے چھ بیٹیاں ہیں اور ایک بیٹا ہے۔ایک بیٹا دبئی کو چلا گیا، مجھے چھ بیٹیوں کی شادی کرنا ہے۔پھر یہ چھ بیٹیوں کی شادی میں یہ پوری اسکیم رکھتے کیا،بول کر انہوں نے پوچھا۔آج اس بچی کی شادی کرنے کے بعد۔۔۔

ఆ స్కీమ్ పెట్టడం వల్ల గిరిజనులంతా చాలా సంతోషపడుతున్నారు. గిరిజనులలో పుట్టిన బిడ్డను పాత చీరలో చుట్టి ఉంచుతారు. ముఖ్యమంత్రిగారు తెచ్చిన పథకం చాలా మంచి పథకం . కేసిఆర్ కిట్ అనేది మా ఒక్క గిరిజన మహిళలకే ఇస్తారా? ఇతర మహిళలకు కూడా వర్తిస్తారా అని అడుగుతున్నాను.

**శ్రీఆర్. రవీంద్ర కుమార్:–** జనాభాలో సగభాగమైన మహిళలకు ముఖ్యమంత్రిగారు మానవీయ కోణంలో ఆలోచించారు. వారు బడ్జెట్‌లో మహిళలకు ప్రాధాన్యత కల్పించారు. ప్రధానంగా మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య లక్ష్మి, గర్భిణీ స్త్రీలు ప్రభుత్వం ఆసుపత్రిలో ప్రసవించే సందర్భంలో మూడు విడతలుగా రూ.12 వేలు, ఆడపిల్ల పుడితే ఇంకొక వెయ్యి రూపాయలు అదనంగా ఇచ్చి మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్నారు. మహిళల ఆలోచనలకు అనుగుణంగా ఈ ప్రభుత్వం పని చేస్తున్నందు గర్వపడుతున్నాను. పుట్టిన బిడ్డ సంరక్షణ కోసం అమ్మఒడిలో భాగంగా కేసీఆర్ కిట్ పెట్టి పదిహేను వస్తువులను వారికి అందించే కార్యక్రమం చాలా గొప్ప కార్యక్రమం . గిరిజన ప్రాంతాలలో మహిళలు ప్రసవించిన తరువాత ఆ శిశువులను పాత బట్టలలో చుడతారు. కనీసం ఆరోగ్య పరమైన చర్యలు చేపట్టక పోవడం వల్ల చాలా మంది చనిపోతున్నారు. పుట్టిన బిడ్డలకు ఆముదంతో మర్దనా చేసి, చెవులలో, కండ్లలో ఆముదం పోయడం వల్ల చాలా మంది శిశువులు మరణించిన సందర్భాలున్నాయి. అటువంటి వాటిని గుర్తించి గౌరవ ముఖ్యమంత్రిగారు కేసీఆర్ అమ్మఒడి కిట్ పేరుతో రెండు వేల రూపాయల విలువైన సామాగ్రిని అందించే కార్యక్రమం చాలా బాగుంది.

నా దేవరకొండ నియోజక వర్గంలో ఆడ శిశువుల అమ్మకాలు జరుగుతున్నాయి. ఇలాంటి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవించే వారికి రూ.12 వేలు, అమ్మఒడి కిట్, కల్యాణలక్ష్మి ద్వారా రూ.75,116లు ఇవ్వాలని బడ్జెట్‌లో పెట్టారు. పెండ్లి భారంగా ఉండే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. చాలా మందికి ఈ పథకాలు ఉపయోగపడతాయి. ఈ పథకాన్ని గౌరవ మంత్రిగారు సరిగా అమలయ్యేలా చేయాలి. కిట్‌లో ఏ ఏ వస్తువులున్నాయి, వాటిని ఎప్పుడు అందిస్తారు, ఎలా మానిటర్ చేస్తారు. ఈ పథకం సరిగా అమలయ్యేలా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుతున్నాను.

**10.10 ఉ.** "అమ్మఒడి" కార్యక్రమంలో భాగంగా అంబులెన్సులను ఇంకా పెంచవలసిన అవసరం ఉంది. గిరిజన తాండాలలోని ప్రజలు ఆటోలు, ఎడ్లబళ్లలో హాస్పిటల్స్‌కి వెళ్తున్నారు. కాబట్టి అంబులెన్సులను పెంచి మారుమూల గిరిజన ప్రాంతాలకు ఇస్తే వారికి ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేస్తున్నాను.

**శ్రీ బి.మదన్‌లాల్ : –** అధ్యక్షా, " కేసీఆర్ అమ్మఒడి" అనే కార్యక్రమం ద్వారా కిట్స్‌ని ఇచ్చి, గిరిజన జాతి ఏనాడు చూడనటువంటి వస్తువులను మా ప్రాంతాలకు పరిచయం చేసి, అయా వర్గాల వారికి జరిగే ప్రయోజనాలను తెలియజెప్పినందుకు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీస్ చేయించుకుంటే ఇస్తున్న కేసీఆర్ మదర్ అండ్ న్యూ బార్న్ బేబీ కిట్, అదే విధంగా హాస్పిటల్స్‌లో డెలివరీస్ చేయించుకుంటే ఇస్తున్న రూ.2000 ఇన్సెంటీవ్ వల్ల మా గిరిజన జాతి కేసీఆర్ గారిని కొనియాడుతున్నారు. కేసీఆర్ కిట్ ద్వారా ఏ రకమైన వస్తువులను ఇస్తున్నారో తెలియజేయాలి. ఇప్పటివరకూ హాస్పిటల్స్‌కు వచ్చి డెలివరీస్ చేయించుకునే అంశంలో వెనుకబడిన వర్గాలకు ఆసక్తి లేకపోవడానికి కారణం ఏమిటంటే, గ్రామీణ ప్రాంతాలలో అమ్మ ఒడి కార్యక్రమానికి సంబంధించి అంబులెన్సు సౌకర్యాలు లేకపోవడమే అధ్యక్షా. గ్రామీణ ప్రాంతాలలో ఉండే వారికి, అమ్మ ఒడి పథకం ద్వారా అంబులెన్సుల సౌకర్యాలు పెంచడం వల్ల హాస్పిటల్స్‌కి తీసుకొచ్చి డెలివరీస్ చేయించుకునే పరిస్థితి ఉంటుంది. అదే విధంగా కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకానికి సంబంధించిన కిట్ వివరాలు, వాటి మీద ఖర్చుపెడుతున్న వ్యయం ఎంతో తెలియజేయాలని కోరుతున్నాను.

**డా. సి. లక్ష్మారెడ్డి : –** అధ్యక్షా, గౌరవసభ్యులు రేఖ గారు, రవీంద్రకుమార్ గారు, మదనలాల్ గారు ప్రశ్నలు అడిగారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మాతా, శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచన మేరకు, గర్భిణీ స్త్రీలను గుర్తించడం, వారికి పోషకాహారాన్ని అందించడం, వాళ్లకు నెలనెలా పరీక్షలు చేయించడం, మందులు ఇవ్వడం, ఎక్స్‌పెక్టెడ్ డేట్ ఆఫ్ డెలివరీని బట్టి సమీప ప్రభుత్వ వైద్యశాలకు 108 వెహికిల్ ద్వారా ప్రసవానికి తీసుకెళ్లడం జరుగుతోంది. అలాగే అక్కడ సుఖ ప్రసవాలకు అవకాశం ఉండే విధంగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధలకు అనుగుణంగా లేబర్ రూమ్స్‌ని తీర్చిదిద్దడం జరిగింది.

ప్రసూతి అయిన తరువాత తల్లీ బిడ్డలను క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడానికి అమ్మఒడి పేరుతో 102 నెంబర్ గల వాహనాలను ఏర్పాటు చేయడం జరిగింది. డెలివరీ వార్డ్స్ని, డెలివరీ రూమ్స్ని పూర్తిగా ఆధునికీకరించడం జరిగింది. గిరిజన ప్రాంతాలలో వెహికిల్స్ బాగా ఉపయోగపడుతున్నాయని, వాటిని ఇంకా పెంచాలని గౌరవసభ్యులు అడుగుతున్నారు. బేబీ కిట్స్కి సంబంధించిన ఐటమ్స్ గురించి అడిగారు. బేబీ కిట్స్లో, బేబికి సంబంధించి మ్యాట్రెసెస్, దోమతెర, చలి కోటు, 2 బేబీ డ్రస్సులు, రెండు వందల గ్రాముల బేబీ పౌడర్, 6 వాషబుల్ న్యాప్కీన్స్, వంద గ్రాముల షాంపూ, రెండు వంద గ్రాముల బేబీ ఆయిల్, రెండు బేబీ సోప్స్, ఒక సోప్ బాక్స్, టాయ్ ఉంటాయి. తల్లికి కూడా ఒక సబ్బు, 2 చీరలు, ప్లాస్టిక్ బాస్కెట్తో ఒక కిట్ ఇవ్వడం జరుగుతోంది. ఒక కిట్కి రెండు వేల రూపాయలు అంచనా వేయడం జరిగింది. ఈ పథకానికి సంబంధించి మొన్ననే బడ్జెట్లో కూడా పెట్టడం జరిగింది. టెండర్ ప్రాసెస్ స్టార్ట్ అయ్యింది. తొందరలో కంప్లీట్ చేసి ఈ కిట్ను కేవలం ట్రైబల్ ఏరియాలోనే కాకుండా అన్ని ప్రాంతాల వారికి ఇచ్చే ప్రతిపాదన ఉంది. పరిశుభ్రమైన వాతావరణంలో ఇన్ఫ్యాంట్ ఉండాలనే ఉద్దేశ్యంతో అన్ని ఐటమ్స్ని కలిపి అందిస్తున్నాము. ఈ పథకం అమలుకు సంబంధించి స్పెషల్ ఆఫీసర్ను ఏర్పాటుచేసి పకడ్బందీగా అమలుచేస్తాము. ఇన్సెంటీవ్కి సంబంధించి రూ.12000 మూడు విడతల్లో ఇవ్వడం జరుగుతుంది. గర్భిణీ స్త్రీలకు పోషకాహార విలువలు అందించడం ద్వారా వారి ఆరోగ్యం బాగుంటుందని దీని ఉద్దేశ్యం. గర్భిణీ సమయంలో నాలుగు వేల రూపాయలు, డెలివరీ సమయంలో నాలుగు వేల రూపాయలు, శిశువు సంరక్షణ కోసం నాలుగు వేల రూపాయలు, ఈ విధంగా మొత్తం పన్నెండు వేల రూపాయలు ఇస్తారు. ఆడ శిశువు జన్మిస్తే మరొక వెయ్యి రూపాయలు అదనంగా ఇవ్వడం జరుగుతుంది. ఇది మంచి కార్యక్రమం, ఈ కార్యక్రమాన్ని చక్కగా అమలుచేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాము. అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## నల్లవాగు మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టు

ప్రశ్న నెం. 2 (2390)

శ్రీ మహారెడ్డి భూపాల్రెడ్డి (నారాయణ్ఖేడ్) – గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ.** నారాయణ్ఖేడ్ శాసనసభ నియోజకవర్గంలోని నల్లవాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు పనుల ప్రస్తుత దశ ఏమిటి,

**ఆ.** ఈ ప్రాజెక్టు క్రింద ప్రతిపాదించిన ఆయకట్టు విస్తీర్ణం ఎంత;

**ఇ.** సదరు ఆయకట్టులో ఏదేని గ్యాప్ ఉందా;

**ఈ.** అయితే, సదరు గ్యాప్ ఆయకట్టును పూరించడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

**సాగునీటి శాఖ మంత్రి (శ్రీ టి. హరీష్ రావు ):– అ.** గ్యాప్ ఆయకట్టు దృష్ట్యా, నల్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులను చేపట్టే ఆవశ్యకత ఉంది. ఈ పనులను 2017-18 లో చేపట్టడమవుతుంది.

**ఆ.** ఈ ప్రాజెక్టు క్రింద స్థిరీకరించాల్సిన ప్రతిపాదిత ఆయకట్టు 6030 ఎకరాలు

**ఇ.** అవునండీ. 2600 ఎకరాల గ్యాప్ ఆయకట్టు ఉందంటే కల్హేరు మండలంలో 2000 ఎకరాలు, పిట్లం మండలంలో 600 ఎకరాలు.

ఈ. గ్యాప్ ఆయకట్టును పూరించడానికి నల్లవాగు మధ్య తరహా ప్రాజెక్టు ఆధునికీకరణను చేపట్టాలని ప్రతిపాదించడమయింది.

**శ్రీ యం. భూపాల్ రెడ్డి:-** అధ్యక్షా, నారాయణ్ఖేడ్ నియోజకవర్గంలోని రైతులు వర్షాల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కంగ్టి మండలంలో ఆరు చెరువులు ఉన్నాయి. మన్నూరులో రెండు చెరువులున్నాయి. నారాయణఖేడ్లో నల్లవాగు ప్రాజెక్టు మాత్రమే ఉంది. ఈ ప్రాజెక్టును 1971 లో పూర్తి చేశారు. ఆరోజు నుండి ఈరోజు వరకూ ఆ ప్రాజెక్టు సిల్ట్తో నిండిపోవడం వల్ల స్టోరేజ్ కెపాసిటీ తగ్గింది. కాలువలు కూడా రిపేర్స్ చేసుకోవలసిన అవసరం ఉంది. కాలువల రిపేర్స్ కోసం రూ. 19 కోట్లు ప్రతిపాదనలు బడ్జెట్లో పెట్టడం జరిగింది. అందుకు మంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ సంవత్సరం ఆ కార్యక్రమం చేస్తామన్నందుకు మంత్రిగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. సిల్ట్తో నిండిపోయి ఆ ప్రాజెక్ట్ స్టోరేజ్ కెపాసిటీ తగ్గింది. స్టోరేజ్ కెపాసిటీని ఇంక్రీజ్ చేస్తే, ప్రాజెక్టు కింది ఆయకట్టుకు నీళ్లు వచ్చే పరిస్థితి ఉంటుంది. ఎఫ్టీఎల్ రెయిజ్ చేస్తే బాగుంటుంది లేదంటే సింగూరు ప్రాజెక్టు నుండి లిఫ్ట్ పెట్టి ఆ లిఫ్ట్ ద్వారా ఆరు కిలోమీటర్ల పైప్లైన్ వేసి నల్లవాగు ప్రాజెక్టులోకి నీళ్లు తీసుకొస్తే ఖరీఫ్లో కూడా పంటలు పండించుకోడానికి అవకాశం ఉంటుంది. అదే విధంగా రబీలో కూడా పంటలు పండించుకోడానికి అవకాశం ఉంది. ఎఫ్టీఎల్ను రెయిజ్ చేయడం అంటే కొంచెం ఖర్చుతో కూడుకున్న పని. ఏది ఏమైనప్పటికీ ఈ రెండింలో ఏదో ఒకటి చేస్తే, పంటలు పండించుకోడానికి రైతులకు అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని

పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందింగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

10.20 ఉ. **శ్రీ టి. హరీష్ రావు (సాగునీటి పారుదల శాఖ మంత్రి):–** అధ్యక్షా, గౌరవ సభ్యులు భూపాల్‌రెడ్డి గారు తెలియజేసినట్లుగా ఆధునికీకరించాల్సిన అవసరమున్నది. ఈ ప్రాజెక్టు 1965వ సంవత్సరంలో ప్రారంభమై 1967లో పూర్తయింది. 6030 ఎకరాలలో ఏ సంవత్సరం కూడా పూర్తిస్థాయి ఆయకట్టు వచ్చిన పరిస్థితి లేదు. గతంలో నేను నారాయణఖేడ్ వెళ్లినప్పుడు గౌరవ ఉపసభాపతి గారు, మా ఎంపీ బి.వి.పాటిల్‌గారు అందరం కలిసి ప్రాజెక్టు సైట్‌ను విజిట్‌చేయడం జరిగింది. ఆ సందర్భంగానే అక్కడి ప్రజలందరూ కోరుకున్న మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. దాదాపు రూ.19 కోట్లతో అభివృద్ధి పనులు అంటే ముఖ్యంగా ఓటి స్లూయిస్‌లు, ఇరిగేషన్ ఛానల్స్, అక్వాడెక్టులు, సూపర్ పాసేజెస్ వంటివన్నీ డీఫంక్ట్ అయినందున నీరంతా వృథా అవుతున్న దృష్ట్యా ఆ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునీకరించి చిట్టచివరి ఆయకట్టుగా ఉన్న 2000 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే రూ.19 కోట్లతో ప్రభుత్వం దగ్గర ప్రతిపాదన పరిశీలనలో ఉన్నది. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ పాసైన తరువాత వచ్చే ఏప్రిల్ మాసంలో దీనికి అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు మంజూరుచేసి పూర్తి స్థాయిలో ఆ ప్రాజెక్టును ఆధునీకరిస్తామని గౌరవ సభ్యుడికి మనవి చేస్తున్నాను.

గౌరవ సభ్యులు మాట్లాడుతూ సిల్టేషన్ చాలా వచ్చింది, దానిని సప్లిమెంటేషన్ చేయాల్సిన అవసరమున్నదని చెప్పారు. వాస్తవానికైతే ప్రాజెక్టుకు పాయింట్764 టిఎంసి కెపాసిటీ ఉంది. దాని డెడ్ స్టోరేజీ కేవలం 44 MCFT. కొంత సిల్టేషన్ వచ్చిన మాట వాస్తవం. కాబట్టి మనం ఆ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునీకరించడం ద్వారా చిట్టచివరి ఆయకట్టు వరకు అంటే మొత్తం 6030ఎకరాలకు సాగునీరు అందించే అవకాశమున్నదని మన అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా గౌరవ సభ్యుడిని పిలిచి త్వరలోనే ఒక సమావేశాన్ని అధికారులతో ఏర్పాటుచేసుకొని పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరు అందించడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

MR.SPEAKER: Question No.2286 Minister for Medical & Health.

## గుండె జబ్బుల రోగుల కోసం స్టెంట్లు

ప్రశ్న నెం. 3(2286)

సర్వశ్రీ తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి (పరిగి), ఎస్.ఎ. సంపత్ కుమార్ (అలంపూర్), డా. జి.చిన్నారెడ్డి (వనపర్తి), తాటిపర్తి జీవన్‌రెడ్డి (జగిత్యాల)– గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖామంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేసెరా;

అ) రాష్ట్రంలో ప్రత్యేకించి హైదరాబాదులో అనేక ప్రయివేటు/ కార్పోరేటు ఆసుపత్రులు చిన్న చిన్న గుండె సమస్యలకు కూడా స్టెంట్లు వేయించుకోవాలని హృద్రోగులను ఒత్తిడి చేస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) స్టెంట్ల ధరలు కూడా ఒకే విధంగా లేని విషయం మరియు ఆసుపత్రులు రోగుల వద్ద అధిక ధరలను వసులు చేస్తున్న విషయం కూడా వాస్తవమేనా?

ఇ) స్టెంట్ల తయారీదారులు ప్రయివేటు ఆసుపత్రులతో కుమ్మక్కై కోట్ల రూపాయలను పోగుచేసుకుంటున్న విషయం కూడా వాస్తవమేనా?

ఈ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

**వైద్య, ఆరోగ్య శాఖామంత్రి (డా. సి. లక్ష్మారెడ్డి):–** అ) లేదండీ

ఆ) లేదండీ

కేంద్ర ప్రభుత్వ జాతీయ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ సంస్థ 13-02-2017 తేదీగల ఎస్.ఓ.నెం.412 (ఇ) లో ధరలను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఔషధ నియంత్రణ సంస్థ ధరలను పర్యవేక్షిస్తున్నది.

ఇ) లేదండీ

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ ఎస్.ఏ. సంపత్ కుమార్:-** అధ్యక్షా, భారతదేశంలోనే మన తెలంగాణ రాష్ట్రంలో గుండెజబ్బులతో చనిపోతున్న వారి సంఖ్య అత్యధికంగా అంటే 57 శాతం మంది మరణిస్తున్నట్లుగా 2014వ సంవత్సరం నుంచి అనేక రకాల సర్వేలు తెలిపాయి. మొత్తం భారతదేశంలోనే 33వేల 143 మంది హృద్రోగాలతో బాధ పడుతూ మరణించిన వారిలో దాదాపు 18 వేల 912 మంది మరణించారని అధికారిక సర్వే ద్వారా తెలిసింది. దాంట్లో దాదాపు 12వేల మంది పైచిలుకు పురుషులు, 6వేల పైచిలుకు మహిళలు అస్తమించిన వాస్తవాన్ని గ్రహించి ఈ హృద్రోగానికి సంబంధించిన వైద్యంలో, వాడేటటువంటి స్టెంట్ల విషయంలో తీసుకోవలసిన అనేక రకాలైన జాగ్రత్తల విషయంలో ప్రభుత్వం శ్రద్ధ వహించాల్సిన అవసరమున్నది. గౌరవ మంత్రిగారిచ్చిన సమాధానంలో ప్రైవేటు లేదా కార్పోరేటు ఆస్పత్రులలో చిన్న, చిన్న గుండె సమస్యలొచ్చిన సందర్భాలలో కూడా అక్కడి డాక్టర్లు స్టెంట్లు వేయించుకోవాలని హృద్రోగులను ఒత్తిడి

చేస్తున్న విషయం వాస్తవమేనా అని అంటే ఉత్పన్నం కాదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వందలాది ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ప్రభుత్వం ఎందుకు ఆ ఆస్పత్రులను వెనకేసుకొస్తున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి.

ఈ మధ్యనే ఒక గ్రామీణ ప్రాంతానికి చెందిన పేదవాడు ఈశ్వరయ్య అనే అతను నిమ్స్ ఆస్పత్రికి వెళితే రూ60వేలకు స్టెంట్ వేస్తామన్నారు. ఇంకొక ఆస్పత్రికి వెళితే ఇంకా తక్కువ ఉంటుందనే ఆశతో ఇంకొక ప్రైవేటు ఆస్పత్రికి వెళితే అక్కడ రూ.1 లక్ష అన్నారు. మరో ఆస్పత్రికి వెళితే రూ.1,25,000 అన్నారు. ఈ రకంగా ఒక్కొక్క ఆస్పత్రిలో ఒక్కొక్క రకమైన ధరలను చెబుతుంటే డబ్బులు ఎక్కువ పెడితే మంచి స్టెంట్ లేదంటే మామూలు స్టెంటు వేస్తారేమో అనే అనుమానాలు ప్రజలలో ఉన్నాయి. అసలే అతను హృద్రోగి అతనికి ఎప్పుడెలా ఉంటుందోననే అభద్రతా భావంతో అతని కుటుంబ సభ్యులు అధిక ధరలను వెచ్చించి స్టెంట్లు వేయించుకునే పరిస్థితి ఉన్నది. స్టెంట్ల ధరలకు సంబంధించి ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం వలన హృద్రోగులు ఇంకా ఎక్కువ గుండెపోటు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

గౌరవ మంత్రిగారు చెబుతున్నట్లుగా నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ సూపర్‌విజన్‌లో ఉన్నందున అవే గైడ్‌లైన్స్‌ను తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని వైద్య శాలల పరిస్థితులకు అనుగుణంగా ఇంకేమైనా గైడ్‌లైన్స్‌ను పొందుపర్చి మరింత పకడ్బంధీగా నిర్వహించాలి. కానీ కేంద్ర ప్రభుత్వ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ సంస్థ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా మన ఔషధ నియంత్రణ సంస్థ నిర్వహించడం లేదనే అనుమానాలు ప్రజలకు కల్గుతున్నాయి. కాబట్టి ఇంకా పటిష్టమైన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన అవసరమున్నది. ప్రభుత్వ ఆస్పత్రులలో స్టెంట్ల ధరలు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రోగుల వద్ద నుండి వసూలు చేస్తారు. ప్రతి వస్తువు మీద ఎమ్మార్పీ ఉంటుంది. కానీ స్టెంట్లకు ఎమ్మార్పీ లేకపోవడం వలన విచ్చలవిడిగా ఎవరికి తోచినట్లుగా ప్రైవేట్ ఆస్పత్రుల వారు స్వతహాగా స్వీయ ధరలను నిర్ణయించుకుంటున్నారు. కాబట్టి దానినుంచి బయటపడటానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలి.

స్టెంట్లలో కూడా డ్రగ్ కోటెడ్ స్టెంట్, మెటల్ స్టెంట్‌లు ఉన్నాయి. మెటల్ స్టెంట్ చీప్‌గా ఉంటుంది కానీ సాధారణంగా ఎవరైనా ఎక్కువ ధర పెట్టైనా సరే మంచి స్టెంట్ వేయించుకోవాలని భావించి డ్రగ్ కోటెడ్ స్టెంట్‌ను వేయించుకుంటారు. డ్రగ్ కోటెడ్ స్టెంట్‌కి ఎమ్మార్పీ లేకపోవడం వల్ల ధరలను ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు విచ్చలవిడిగా నిర్ణయిస్తున్నారు. కాబట్టి వీటిని నియంత్రించడానికి నలుగురు ఎక్స్‌పర్ట్స్‌తో ఒక ప్యానల్ వేసి నేషనల్ ప్రైసింగ్ ఫార్మాస్యూటికల్ నార్మ్స్‌ను అమలుచేస్తూ ఇంకా ఇక్కడి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా యాడ్ చేయాల్సిన అవసరమున్నది. ప్రైసింగ్ అథారిటీతోబాటు 2013లో ఇదే రకమైన చర్చ ఇదే శాసనసభలో జరిగినప్పుడు అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ యూపీఏ ప్రభుత్వం యాంజియో ప్లాస్ట్ రూ.60వేల నుంచి రూ.40వేలకు తగ్గించిన మాట వాస్తవం. ఆ రకంగా అందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించే ప్రయత్నంలో భాగంగా అప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా స్టెంట్ల ధరలను తగ్గించిందని మేం కూడా వింటున్నాము. కానీ ఎంత తగ్గినా వాటిమీద నియంత్రణ లేకపోవడం వల్ల అడ్డగోలుగా ప్రైవేట్ ఆస్పత్రులు పేద ప్రజలను దోచుకుంటున్నందున దయచేసి ఒక నిర్దిష్టమైన కమిటీ వేసి నిర్ధారణ చేసి ఒక ప్రైస్ ఫిక్స్‌చేసి అది కూడా పబ్లిక్ డొమైన్‌లో ఉంచితే ఏ హృద్రోగి అయినా సరే ఏ స్టెంట్ ఎక్కడ ఎంత ధరకు దొరుకుతుందనేది క్లారిటీగా ఉంటే హృద్రోగులకు మేలు జరుగుతుంది. కాబట్టి ప్రభుత్వం ఆవైపుగా చర్యలు తీసుకోవాలని మీద్వారా కోరుతున్నాను.

**డా. జి. చిన్నారెడ్డి:–** అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన సమాధానం సత్యదూరంగా ఉన్నది. రాష్ట్రంలో గుండెజబ్బుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతున్నది. ఇందాక సంపత్ కుమార్‌గారు చెప్పినట్లుగా గుండెజబ్బులతో మరణించిన వ్యక్తుల సంఖ్య చూస్తే 2014లో 33,140 మెడికల్లీ సర్టిఫైడ్ డెత్స్ చూస్తే దాంట్లో 18,912 మంది గుండెజబ్బులతో చనిపోయారనే గణాంకాలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. ముఖ్యంగా ఎవరైనా గుండెజబ్బుతో ఆస్పత్రికి వెళితే గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలు పూడుకపోయాయి, స్టెంట్లు వేయాలని మన ఆస్పత్రులలోని డాక్టర్లు చెబుతుంటారు.

**10.30 ఉ.**

ఒకప్పుడు మనం దిగుమతి చేసుకునే స్టెంట్లపైనే ఆధారపడే వాళ్లము. ఇది ఒక గొప్ప వ్యాపారంగా ఉండేది. ఈ మధ్య భారతదేశంలో నైపుణ్యాన్ని పెంచుకొని మన దేశంలో తయారు చేసుకుంటున్నప్పటికీ, దిగుమతి చేసుకున్న స్టెంట్లే నాణ్యంగా ఉన్నాయనే మాట అందరి నోటా వింటున్నాము. ఎనభై శాతం మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందుతుండగా, కేవలం 20 శాతం మందే ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా వైద్యం పొందుతున్నారు. గుండె జబ్బులతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే స్టెంట్స్ వేసే పేరుతో విపరీతంగా రోగుల నుంచి డబ్బులు లాగుతున్నారు. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ, ఫిబ్రవరి 13, 2017న స్టెంట్ల ధరలను నిర్ధారించడం జరిగింది. ఈ స్టెంట్ల ధరలు బాగా తగ్గడం మూలానా ప్రైవేట్ ఆసుపత్రులు ఈ స్టెంట్స్ వేసే కార్యక్రమాన్ని కొంత కాలం

నిలిపివేశాయి. ఆసుపత్రులు దిగుమతి చేసుకునే కొన్ని రకాల డ్రగ్ ఎల్యూటింగ్, స్టెంట్లల్లో వారికి 650 శాతానికి పైగా మరియు బేర్ మెటల్ స్టెంట్స్ విషయంలో 450 శాతానికి పైగా లాభం ఉంటోంది. భారతదేశంలో స్టెంట్ల ధరల నియంత్రణ అమలు తేది ఫిబ్రవరి 13,2017 తరువాత ఆసుపత్రులకు గుండె జబ్బు రోగుల ద్వారా వచ్చే ఆదాయం బాగా తగ్గింది. అధునాతన టెక్నాలజీతో పోటీ పడే విధంగా మన దేశంలో ఇలాంటి స్టంట్లను తయారు చేసే విధంగా మనం ఎదగాలి. హైదరాబాద్‌ను మనం మెడికల్ హబ్‌గా చెప్పుకుంటున్నాము. భారతదేశంలో తెలంగాణ రాష్ట్రంలోనే గుండె జబ్బు రోగులు అధికంగా ఉన్నారు. ఈ స్టంట్లను ఏర్పాటు చేసే యూనిట్ మన దగ్గర ఏర్పాటు చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి గారికి మనవి చేస్తున్నాను. ఈ విధంగా స్టంట్ల తయారీని చేసినట్లైతే రోగులకు ఇంకా సరసమైన ధరలకే స్టంట్లను అందించడానికి వీలౌతుందని మనవి చేస్తున్నాను. ప్రైవేట్ ఆసుపత్రులకు ఆరు వేల స్టంట్లు మరియు ఆరోగ్య శ్రీ పథకం కింద మరొక వెయ్యి స్టంట్లు మొత్తంగా నెలకు ఏడు వేల స్టంట్లు మన రాష్ట్రంలో అవసరమౌతున్నాయని ప్రభుత్వానికి మీ ద్వారా మనవి చేస్తున్నాను. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ వాళ్లు హెల్ప్ లైన్ నెంబరును ఏర్పాటు చేసిన విధంగానే మన రాష్ట్ర ప్రభుత్వం ఒక హెల్ప్ లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లైతే, రోగులు వారి ఇబ్బందులను తమరికి తెలియజేయడానికి, తగు సహాయం పొందడానికి వీలుంటుందని మంత్రి గారికి మనవి చేస్తున్నాను. ఈ స్టంట్ల విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోయినట్లైతే ఆసుపత్రులు మరియు వైద్యులు అధికంగా లబ్ధి పొందే అవకాశం ఉంది.

**శ్రీ టి. జీవన్ రెడ్డి: –** అధ్యక్షా, నిరుపేద వర్గాలకు వైద్యం ఆర్థికంగా భారం కావడంతో గత ప్రభుత్వ హయాంలోనే వారికి ఉచితంగా వైద్య అందించాలనే భావనతో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేసి దానిలో ఈ గుండె జబ్బుకు సంబంధిత వైద్యాన్ని చేర్చడం జరిగింది. సాధారణంగా గుండె జబ్బు వచ్చిన పేదలు ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యాన్ని పొందాలని ప్రయత్నిస్తారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందించే స్టంట్లు మేలైన నాణ్యత లేనందున మీరు అధిక మొత్తం డబ్బులను అదనంగా చెల్లించినట్లైతే డ్రగ్ కోటెడ్ స్టంట్లను వేయడానికి పరిశీలిస్తామని ఉంటుందని కార్పొరేట్ ఆసుపత్రుల వారు రోగులకు చెబుతున్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో పొందే ఉచిత వైద్య సదుపాయానికి అదనంగా రోగుల వద్ద నుంచి డబ్బులను వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రావడం జరుగుతోంది. కావున, ఈ మెటల్ మరియు డ్రగ్ కోటెడ్ మొదలైన స్టంట్ల విషయంలో నాణ్యత ఒకేలా ఉండే విధంగా ఆరోగ్య శ్రీలో సదుపాయాన్ని కల్పిస్తే బాగుంటుదనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాను. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొదటగా నిమ్స్ ఆసుపత్రి గుర్తుకు వస్తుంది. కానీ, దురదృష్టవశాత్తు ఆసుపత్రికి వెళ్లగానే వెంటిలేటర్స్ లేవనీ, పడుకల ఖాళీగా లేవనీ ఏదో ఒక విధంగా రోగులను చేర్చుకోవడానికి తిరస్కరిస్తున్నారు. నిమ్స్ ఆసుపత్రి స్థాయిని పెంచుకొని కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏవిధంగా ఏర్పాటు చేసుకునే విషయాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. రోగులను చేర్చుకునే విషయంలో తిరస్కరించడం మూలానా గుండె జబ్బు మరియు ట్రామా కేసుల వారు అధికంగా ఇబ్బందులు పడుతున్నారు. నిమ్స్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారికి విన్నవిస్తూ, ఆసుపత్రిని విజిట్ చేయాలని, పేద రోగులను చేర్చుకునే విషయంలో తిరస్కరించకుండా చూడాలని మంత్రి గారిని కోరుతున్నాను. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం పొందడం మన హక్కుగా భావిస్తాము. రోగులకు అత్యవసర సేవలు అందించే విషయంలో నేను స్వయంగా మాట్లాడిన సందర్భంలోనూ, మా వద్ద వెంటిలేటర్ సౌకర్యం లేదని, మీరు చేర్పించుకోమంటే చేర్చుకుంటామని, తదుపరి ఏదైనా జరిగితే మీరే బాధ్యులని చెప్పే విధంగా మాట్లాడటం జరుగుతోంది. కావున, ఈ విషయమై దృష్టి కేంద్రీకరించడంతోబాటుగా, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా గుండె జబ్బులకు సంబంధించిన స్టంట్లను అందించే విషయంలో లోపాలు లేకుండా నాణ్యత కలిగిన స్టంట్లను అందిస్తున్నామనే అభిప్రాయాన్ని ప్రభుత్వ పరంగా ప్రజలకు కల్పించాలని మనవి చేస్తున్నాను.

**శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్ (మహబూబ్‌నగర్): –** అధ్యక్షా, గతంలో గుండె జబ్బుల విషయంలో సరైన వైద్య పరీక్షలు, సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది చనిపోయేవారు. ఈసిజి, అంజియోగ్రామ్, అంజియోప్లాస్ట్ మొదలైన వైద్య పరీక్షల వల్ల స్టంట్లను వేయాలా వద్దా అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. కానీ, చాలా ఆసుపత్రుల వాళ్లు హృద్రోగులు వెళ్లగానే మీకు స్టంట్ వేయాలని, మాములు నాణ్యత కలిగిన స్టంట్ వేసినట్లైతే ఐదు సంవత్సరాలు పని చేస్తుందని, మేలు రకం స్టంట్‌ని వేసినట్లైతే 50 సంవత్సరాలు వస్తుందని, వెంటనే స్టంట్ వేయాలని భయపెడుతున్నందున బ్రతకాలనే కోరికతో తమ ఆస్తులను అమ్ముకొని మేలైన స్టెంట్లనే వేయమని రోగులు చెబుతారు. ఈ స్టంట్ల విషయంలో నియంత్రణ లేనందున చాలా ఆసుపత్రుల్లో మోసాలు జరుగుతున్నాయి. ఈ విధంగా మోసం చేసే వారి విషయంలో నేటి వరకు ఏ రకమైన చర్యలు తీసుకున్నారు, వీరిపై కఠినమైన చర్యలు తీసుకునేందుకు చట్టంలో

ఏమైనా మార్పులు తీసుకువచ్చారా, నిత్యం ఇలాంటి మోసాలు జరుగుతూనే ఉన్నాయి. అదే విధంగా గుండె జబ్బుల రాకుండా ఉండటానికి ప్రజల్లో ఏమైనా అవగాహన చర్యలు చేపడుతున్నారా, కలరా మొదలైన జబ్బుల విషయంలో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాము. గుండె జబ్బుల ద్వారా అనేకమంది చనిపోతున్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నాను. ఏ స్టంటుకు ఏ ధర, ఈ రకమైన స్టంట్లనే వాడాలనే విషయమై ప్రైవేట్ ఆసుపత్రులకేమైనా నిర్ధేశించారా, నాణ్యత కలిగిన ఈ స్టంట్లను ప్రభుత్వ పరంగా సరఫరా చేయడానికేమైనా అవకాశం ఉన్నదా, అమెరికా నుంచి కూడా వచ్చి రోగులు ఇక్కడ వైద్యం పొందుతున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించే విషయమై గత ఇరవై సంవత్సరాల క్రితమే డా.అబ్దుల్ కలాం గారు నిమ్స్‌లో స్టంట్లను తయారు చేయడం జరిగింది. నాణ్యత గల స్టంట్లను మన దగ్గరే తయారు చేయడానికేమైనా అవకాశం ఉందా అనే విషయాన్ని తెలియజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. రెండు నెలల క్రితం మహబూబ్ నగర్ జిల్లాలో ఒక తాండాలో 15 మంది మగవాళ్లలో 10 మందికి ఆపరేషన్ చేశారు. అదే విధంగా కలెక్టర్ గారు పర్యటన సందర్భంలో ఇద్దరు చిన్న పిల్లలు కుంటుకుంటు నడవడాన్ని గమనించి ఎందుకు కుంటుతున్నారనే తెలుసుకోగా వారిద్దరికి అపెండిసైటిస్ ఆపరేషన్ అయింది. ఈ విధంగా ఎందుకు జరిగిందని విచారణ చేయగా ప్రతి గ్రామంలో ఎనభై శాతం మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్, అపెండిసైటిస్ ఆపరేషన్లు చేయడం జరుగుతోంది. ఈ విషయమై ఏరకమైన చర్యలు తీసుకున్నారనే విషయాన్ని తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ గారికి చెప్పగా వారు సీరియస్‌గా సమస్యను నోట్ చేసుకోవడం వల్ల సమస్య పరిష్కారమౌతుందని అనుకున్నప్పటికీ, మరల నెల రోజుల తరువాత సమస్య పునరావృత్తం కావడం జరిగింది. మరల అధికారులకు సంబంధిత పేర్లను అందించినప్పటికీ, అక్రమ ఆపరేషన్లకు పాల్పడిన వారిని వదిలేసి, ఆసుపత్రుల్లో పార్కింగ్ స్థలం ఉన్నదా, ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఉన్నాయా, అనే అంశాలపై దృష్టిని కేంద్రీకరించి, మామూలు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కావున, ఈ విషయమై వెంటనే తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. గుండె జబ్బు వచ్చినట్లైతే త్వరగా చనిపోవడానికి అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాథ్ ల్యాబ్‌లు లేవు. ప్రైవేట్ ఆసుపత్రుల వారికి సిఎమ్ఆర్ఎఫ్ ద్వారా డబ్బులు చెల్లించి వారిని పోషించేందుకు బదులుగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో క్యాథ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, ఆ ఆసుపత్రికి వెళ్తే ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడుతారనే భరోసాను కల్పించాల్సిన అవసరం ఉన్నది. ఈ విషయమై కావాల్సిన ప్రత్యేక చర్యలను ఎప్పటిలోగా చేపడుతారనే విషయాన్ని తెలియజేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**10.40 ఉ.** **డా. సి.లక్ష్మా రెడ్డి :–** అధ్యక్షా, గుండె జబ్బుల స్టంట్లకు సంబంధించి చాలా మంది గౌరవ సభ్యులు అడగడం జరిగింది. ముఖ్యంగా గుండె జబ్బుల ద్వారా 57శాతం రోగులు చనిపోతున్నారని సభ్యులు సంపత్ కుమార్ గారు, 18వేల మంది చనిపోతున్నారని సభ్యులు చిన్నా రెడ్డి గారు అన్నారు. వారిద్దరు మాట్లాడిన దానిలో చాలా వ్యత్యాసం ఉంది. మన రాష్ట్రంలో సంవత్సరానికి మూడు లక్షల మంది చనిపోతున్నారు. అందులో 18వేల మంది చనిపోతున్నారని సభ్యులు చిన్నా రెడ్డి గారు చెప్పిన మాట వాస్తవం. సభ్యులు సంపత్ గారు చెప్పినట్లుగా 57శాతం అనేది కరెక్ట్ కాదు.

(తెలంగాణ రాష్ట్రంలో 57శాతం చనిపోతున్నారని చెప్పానని సభ్యులు సంపత్ గారు అన్నారు.)

మొత్తం మరణాల్లో గుండె జబ్బుల ద్వారా 57 శాతం చనిపోతున్నారని సభ్యులు సంపత్ గారు చెప్పారు. అది కూడా కరెక్ట్ కాదు. భారత ప్రభుత్వం గుండె వ్యాధిగ్రస్తుల చికిత్సకు అవసరమైన స్టంట్లను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి తగు చర్యలు తీసుకుంటోంది. మినిస్ట్రీ ఆఫ్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ క్రింద ఉన్న జాతీయ ఫార్మాస్యూటికల్స్ ప్రైసింగ్ అథారిటీకి తగిన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ అథారిటీ ద్వారా మందు పూత లేని స్టంట్ల రేట్లను నిర్ణయించడం జరిగింది. అంటే మెడికల్ కోటింగ్ లేని వాటికి 7,260 రూపాయలుగా, మెడికల్ కోటింగ్ ఉన్న స్టంట్స్‌కి 29,600 రూపాయలుగా ధరను నిర్ణయించడం జరిగింది. సభ్యులు చిన్నారెడ్డి గారు చెప్పినట్లుగా ఫిబ్రవరి నెలలోనే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ నిర్ణయాలను అమలు పరచడానికి రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అథారిటీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ధరల నియంత్రణ పాటించే విధంగా ఆయా ఆసుపత్రులను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తున్నాము. ఇప్పటికి 36 ఆసుపత్రులను తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ చేసిన అన్ని ఆసుపత్రులు ధరల నియంత్రణను పాటిస్తున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకాలంలో నియమిత ధరల్లో స్టంట్లు అందుబాటులో ఉండే విధంగా అన్ని రకాల చర్యలు ప్రభుత్వం చేపడుతోంది. ఈ కఠిన వైఖరితో కొన్ని స్టంట్ల సంస్థలు మార్కెటింగ్ నుండి వెనుకకు పోతున్నాయి. స్టంట్లను వెనుకకు

తీసుకుంటున్నాయని తెలిసిన వెంటనే ఆయా సంస్థలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట్లాడి స్టంట్లను అవసరానికి అందుబాటులో ఉండే విధంగా అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతోంది. స్టంట్ల విషయంలో ప్రజలు కాని, సభ్యులు కాని భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వ చట్టమైన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను ఈ సభ ద్వారానే ఆమోదింప చేసి పటిష్టమైన ప్రణాళికను అమలు చేయడం జరుగుతుంది. ధరల నియంత్రణ గాని, ఆసుపత్రుల మీద నియంత్రణ గానీ గతంలో జరగలేదు. గతంలో ఉన్న ప్రభుత్వాలు ఆలోచించి సిస్టమ్‌ను అడాప్ట్ చేసిఉంటే ఎప్పుడో కంట్రోల్ అయ్యేది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం యాక్ట్‌ను తీసుకురావడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుంది. ఈ యాక్ట్ ద్వారా ధరల నియంత్రణ జరుగుతుంది. గతంలో ఈ ఆసుపత్రిలో ఈ సర్జరీకి ఇంత ధర ఉండాలనే నియంత్రణ లేదు. ఇప్పుడిప్పుడే కేంద్ర ప్రభుత్వం ఈ యాక్ట్ మీద చర్యలు చేపట్టి ముందుకు పోతోంది కాబట్టి, మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆచరణలోకి తీసుకురావడం జరిగింది కాబట్టి, తప్పకుండా యాక్ట్‌ను అడాప్ట్ చేసుకుని పూర్తి స్థాయిలో అమలు చేసి చిన్నా రెడ్డి గారు చెప్పినట్లుగా కచ్చితంగా ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి ఈ యాక్ట్‌ను అమలు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుంది.

అన్‌వాంటెడ్ సర్జరీస్ విషయంలో సభ్యులు శ్రీనివాస్ గౌడ్ గారు చెప్పింది వాస్తవం. గతంలో ఎక్కడా నియంత్రణ లేక అన్ని రంగాల్లో వ్యవస్థను భ్రష్టు పట్టించడం జరిగింది. ఏ డిపార్ట్‌మెంట్ చూసినా, ఏ సిస్టమ్ చూసినా పూర్తిగా ఒక రకమైన వాతావరణం గతంలో ఉండేది. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడిప్పుడే కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ ఇటువంటివన్నీ నియంత్రించడానికి అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతోంది. గతంలో విచ్చలవిడిగా వదిలి పెట్టడం వలన నాటు సారా, గుడుంబాల ద్వారా వేల మంది అమాయకులు చనిపోయిన మాట వాస్తవం కాదా? అటువంటిది మన ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి గారు అనేక చర్యలు తీసుకుని గుడుంబాను 100శాతం నియంత్రించి ఎంతో మంది చావులకు గురి కాకుండా ఆపడం జరిగింది. గతంలో భ్రష్టు పట్టించిన వ్యవస్థలో ఇప్పుడిప్పుడే మార్పులు తీసుకు రావడం జరుగుతోంది. నేను ఏ మీటింగ్‌కి వెళ్లినా, ప్రెస్ మీట్‌కి వెళ్లినా అన్ వాంటెడ్ సర్జరీస్ జరపవద్దని చెబుతున్నాను. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల వాళ్లు అపెండిసైటిస్, సిజేరియన్లు, గర్భ సంచి తీసేయడం అనే ఆపరేషన్లను కామన్‌గా చేస్తున్నారు. వీటి నియంత్రణ కోసం ఇప్పటికే చాలా ఆసుపత్రుల మీద చర్యలు తీసుకోవడం జరిగింది. గతంలో ఎప్పుడూ ఇటువంటి చర్యలు చేపట్టలేదు. రాష్ట్రంలో మొదటి సారిగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వారు కూడా 8 ఆసుపత్రుల మీద చర్యలు తీసుకోవడం జరిగింది. ఇప్పటికే డిపార్ట్‌మెంట్ పరంగా చాలా ఆసుపత్రులను సీజ్ చేయడం జరిగింది. సభ్యులు శ్రీనివాస్ గౌడ్ గారు చెప్పినట్లు తప్పు చేసిన వారు తప్పించుకోకుండా పకడ్బందీగా చర్యలు చేపడతాము. నిమ్స్ ఆసుపత్రి గురించి సభ్యులు జీవన్ రెడ్డి గారు చెప్పారు. గతంలో కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే. వాటిని పూర్తి స్థాయిలో నివారిస్తున్నాము. ప్రస్తుతం 109 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఉన్న 46 ఎమర్జెన్సీ పడకలను 100 వరకు పెంచాము. దానితో చాలా వరకు వెయిటింగ్ లిస్ట్ లేకుండా, ఇబ్బంది లేకుండా ఉంది. మొన్ననే బడ్జెట్‌లో ప్రకటించినట్లుగా కొత్తగా 3 నుండి 4 నిమ్స్ స్థాయి ఆసుపత్రులను ఏర్పాటు చేసి హైదరాబాదులో పేషెంట్లకు ఇబ్బంది రాకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం జరుగుతోంది.

## గొర్రెల పెంపకం

ప్రశ్న నెం.4(2244)

సర్వశ్రీ అంజయ్య ఎల్గనమోని (షాద్‌నగర్), చింతా ప్రభాకర్ (సంగారెడ్డి), పుట్టా మధుకర్ (మంథని), చల్లా ధర్మా రెడ్డి (పరకాల్)– గౌరవనీయులైన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలో పెద్ద ఎత్తున గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

ఇ) 2017–18 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన గొర్రెల పెంపకం యూనిట్ల సంఖ్య ఎంత?

ఈ) అందుకు ఖర్చు చేయాల్సిన నిధుల పరిమాణం, గతంలో ఇచ్చిన, ప్రస్తుతం ఇవ్వాలని నిర్ణయించిన సబ్సిడీ శాతం ఎంత?

పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ తలసాని శ్రీనివాస యాదవ్): – అ) అవునండీ.

ఆ) పథకం వివరాలను పరిశీలించడమవుతున్నది.

ఇ & ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ వై. అంజయ్య :–** అధ్యక్షా, శాసన సభలో గౌరవ ఆర్థిక శాఖా మాత్యులు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో గొర్రెల కాపరులకు వచ్చే రెండు సంవత్సరాల్లో 84 లక్షల గొర్రెలను కొనుగోలు చేసి 4లక్షల కుటుంబాలకు యూనిట్‌కు 75 శాతం సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేస్తామని చెప్పినప్పుడు, నిజంగా మన తెలంగాణ రాష్ట్రంలో గల యాదవ కులస్తులంతా మా కులస్తుల జీవన విధానంపై, వృత్తిపై మంచి అవగాహన ఉండి మా కుటుంబాలను బాగు పరచినందుకు గౌరవ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నందుకు మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలు కూడా ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకుని ముఖ్యమంత్రికి పాదాభిషేకం చేశారు.

**10.50 ఉ.** కనుక ఇటువంటి మంచి కార్యక్రమాన్ని గొర్రెల పెంపకాలను సొసైటీ ద్వారా పంచుతామని అంటున్నారు. ఈ విధంగా చేస్తే సహకార సంఘం చట్టాలను సవరిస్తారా? ఇప్పుడు ఉన్న సంఘ సభ్యులకు మాత్రమే గొర్రెల పంపకం చేస్తే ఇబ్బందులు వస్తాయి. ఏ విధంగా, ఎప్పుడు మిగిలిన వారిని సభ్యులుగా చేసుకుంటారనే విషయాలు తెలపాలని అడుగుతున్నాను. ఒక యూనిట్‌కి 25 ఆడ, మగ గొర్రెలను ఇస్తే, వీటి పెంపకానికి ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నుంచి షెడ్లను, గడ్డిని ఏర్పాటు చేసే అవకాశం ఉందా? ప్రభుత్వం అందించే 25 గొర్రెల యూనిట్‌కు లైఫ్ ఇన్సూరెన్స్ ఏమైనా చేస్తారా, ఇన్స్యూరెన్స్ చేస్తే ఏ విధంగా చేస్తారు? దూర ప్రాంతాలకు గొర్రె కాపరులు గొర్రెలను మేతకు తీసుకువెళ్లినప్పుడు, పులుల బారిన మరియు పిడుగు పాటుకు చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా రూ.5లకు పెంచే అవకాశం ఉన్నదా? గొర్రెలను కేవలం మాంసం కోసమే పెంచకుండా, వ్యవసాయానికి సంబంధించిన మంచి ఎరువు వస్తుంది, గొర్రెల ఉన్నితో పరిశ్రమలను పెడితే గొంగళ్లు తయారవుతాయి, కనుక వీటి కోసం ఉపయోగించుకునే అవకాశం ఉందా? అడవి ప్రాంతంలోని కొంత ప్రాంతాన్ని వన సంరక్షణ సమితులకు ఇచ్చినట్లు, గొర్రె కాపరులకు కొంత అడవి ప్రాంతాన్ని ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారు అన్ని విషయాలను ఇంప్లిమెంట్ చేస్తే మా కుటుంబాలన్నీ బాగుపడతాయని, కనుక ఆ దిశలో పై అంశాలవైపు పయనించాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ చింతా ప్రభాకర్:–** అధ్యక్షా, చేతి వృత్తులు, కుల వృత్తులకు సంబంధించి, చేయూతనిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్న గొప్ప ఆలోచనతో, వారు బాగుంటేనే ఈ రాష్ట్రం బాగుపడుతుందన్న ఆలోచన చేసిన గౌరవ ముఖ్యమంత్రి గారికి, మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ గారికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నాను. మన రాష్ట్రంలో ఈ రోజు మాంసం ఉత్పత్తి పెంచుకోవడానికి సంబంధించి, గొర్రెల కాపరులకు గొర్రె పిల్లల్ని అందించే కార్యక్రమంలో ఏ ఏ రాష్ట్రాల నుంచి గొర్రె పిల్లల్ని దిగుమతి చేసుకోవాలని ఆలోచన చేస్తున్నారు? అదేవిధంగా గొర్రె పిల్లల్ని లబ్ధిదారులకు చేర్చే బాధ్యత ఎవరు తీసుకుంటున్నారు? మన రాష్ట్రంలో డిమాండ్ మేరకు మాంసం ఉత్పత్తి ఏ మేరకు పెంచుకోబోతున్నాము? గొర్రె పిల్లల పెంపకంపై ఆధారపడి ఉన్న ఎస్.సి, ఎస్.టి, కుటుంబాలను ఏ విధంగా ఆదుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. కొత్త సభ్యులను ఇందులో చేర్చుకోవడంలో, కొత్త సంఘాలను ఏర్పాటు చేయడంలో యోచిస్తున్నారా? ఒకవేళ ఆ యోచనలో ఉంటే, వాటికి సంబంధించిన వివరాలను సభలో తెలియజేయాలని కోరుతున్నాను. గొర్రెల మేతకు సంబంధించి కరవు ఏర్పడ్డప్పుడు, ఎండాకాలం గడ్డు సమయంలో నీళ్లు దొరకక గొర్రెలు బక్కచిక్కి పోయినప్పుడు, రోగాల బారిన పడి చనిపోయేటటువంటి ప్రమాదం ఉంది, కనుక అటువంటి ఇబ్బందులు రాకుండా ఉండే మార్గాల అన్వేషణ ఏదైనా చేస్తున్నారా? ఎన్.సి.డి.సి ద్వారా ఎంతమందికి లోన్లు ఇవ్వాలనే విషయాలను మీ ద్వారా మంత్రి గారు తెలియజేయాలని కోరుకుంటున్నాను.

**శ్రీ పుట్టా మధుకర్:–** అధ్యక్షా, కుల వృత్తులు, చేతి వృత్తులు బ్రతికి ఉన్నంత కాలం ఆకలి చావులు లేవు, ఆత్మహత్యలు లేవు. ఎప్పుడైతే ఆంధ్ర పాలకులు సమైక్య పాలనలో వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసారో, అప్పటి నుంచి ఆకలి చావులు, ఆత్మహత్యలు జరిగాయి. ఈ ఆకలి చావులను ఆపడానికి గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకున్న నిర్ణయానికి మనస్ఫూర్తిగా భగవంతుడు మంచి ఆలోచనలు కల్పించినందుకు కోరుతూ, ముఖ్యమంత్రి గారికి, మంత్రి ఈటల రాజేందర్ గారికి, మంత్రివర్యులు తలసాని శ్రీనివాస యాదవ్ గారికి ధన్యవాదములు తెలియజేస్తున్నాను. గొర్రె కాపరుల సంఘంలో అన్ని కులాల వారికి సభ్యత్వం ఉంది. కానీ మన రాష్ట్రంలో కొన్ని వృత్తులు, కొన్ని కులాలకే పరిమితమైనప్పటికీ, చట్టాల్లో మాత్రం అందరికీ అవకాశం ఉంది. కనుక గొల్ల, కురుమల కోసం సర్వే చేస్తున్నాము. మిగిలిన కులాల వారిని ఏ విధంగా ఇందులో అకామడేట్ చేసుకుంటారు. ఒకేసారి పెద్ద ఎత్తున లక్షల గొర్రెలను కొంటామని, దేశమంతా ప్రచారమైనందున, గొర్రెల ధర కూడా పెరిగే అవకాశం ఉంది. ధర పెరగకుండా ఆలోచన చేస్తున్నారా? ఇంత పెద్ద ఎత్తున పశువులను మన రాష్ట్రానికి దిగుమతి చేసుకుంటున్నాము. కాని మన వద్ద వెటర్నరీ ఆసుపత్రుల్లో డాక్టర్లు, మౌలిక సదుపాయాలు సరిగా లేవు. ఎందుకంటే, మనుషులమైతే జ్వరం వచ్చినప్పుడు

చెప్పగలము. కాని పశువులకు ఆ అవకాశం లేదు. పశువులకు ఏ చిన్న వ్యాధి వచ్చినా అది మనుషులకు ప్రబలే అవకాశం ఉంది, కనుక వెటర్నరీ ఆసుపత్రులను, డాక్టర్లను, మరియు మొబైల్ అంబులెన్స్‌ల సౌకర్యాలను పెంచే ఆలోచన చేస్తున్నారా? ఈ విషయాలపై మంత్రి గారు వివరణ ఇవ్వాలని మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ సిహెచ్. వంశీచంద్ రెడ్డి (కల్వకుర్తి):–** ప్రభుత్వం నాలుగు లక్షల కుటుంబాలకు, 84లక్షల గొర్రెలను పంపిణీ చేస్తుందని ఆర్థికశాఖ మంత్రి గారు బడ్జెట్‌లో చెప్పడం జరిగింది. ఈ విషయమై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై నాకు కొన్ని సందేహాలు ఉన్నాయి. మంత్రి గారు మంచి ఆలోచనతో ఆఫిషియల్స్‌ని, మరియు సంఘానికి సంబంధించిన పెద్దల్ని అన్ని రాష్ట్రాలకు పంపి వయబిలిటీని స్టడీ చేయమని చెప్పారు. వారు స్టడీ చేసిన ప్రకారం ఉత్తర భారతదేశంలో గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని మన వద్దకు తీసుకువస్తే, మన ప్రాంతంలో అవి సర్వైవ్ కావనే నిర్ధారణకు రావడం జరిగింది. ప్రభుత్వం గొర్రె పిల్లల్ని కొనాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల గొర్రెలు కానీ, నెల్లూరు, డక్కని గొర్రెలు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులకు సంబంధించిన వాటిని కొనవచ్చు. 2012వ సంవత్సరంలో విడుదల చేసిన 19వ లైవ్‌స్టాక్ సెన్సస్ ప్రకారం మహారాష్ట్రలో ఉన్న ఆడ గొర్రెల సంఖ్య 20లక్షలు.

**11.00 ఉ.** ఆంధ్రప్రదేశ్‌లో 60లక్షలు, మొత్తం ఒక కోటి ఎనభై మూడు లక్షల యాభై వేలు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల వయస్సు గల గొర్రె పిల్లలను మాత్రమే గొర్రెల పెంపకానికి ఉపయోగిస్తారు. మొత్తం గొర్రెల జనాభాలో ఆడగొర్రెలు 30 శాతం ఉంటాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లో మనకు ఉపయోగపడే గొర్రెల సంఖ్య 50నుంచి 60 లక్షల వరకు ఉంటుంది. అందులో ఆరోగ్యకరంగా, ఈతకు ఉపయోగపడే గొర్రెలు మాత్రమే మనం పెంచుతాము. మొత్తం 50 నుంచి 60లక్షల గొర్రెలు ఉంటే, 84లక్షల గొర్రెలను మీరు ఏ విధంగా ఇవ్వగలుగుతారు? గొర్రెల కాపరులు మంచిగా ఉన్న గొర్రెలను అమ్మడానికి ముందుకు రావడం లేదు. వారు కూడా ఒక సంవత్సరం వయస్సు దాటిన గొర్రె పిల్లలను పెంచుకోవాలనుకుంటున్నారు. అనారోగ్యం ఉన్న గొర్రె పిల్లలను, వయస్సు పైబడి ఈత దశను కోల్పోయిన వాటినే వాళ్లు అమ్ముతున్నారు. ఈ పరిస్థితిల్లో ప్రభుత్వం మాట ఇచ్చినట్లుగా అన్ని గొర్రెలను కొనగల్గుతుందా? గత రెండు సంవత్సరాల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్.సి.డి.సి. స్కీమ్ ద్వారా గొర్రెలను ఎక్కడ కూడా కొనలేదు. ఉన్న గొర్రెలనే చూపించి వాటిపైన ఋణాలు తీసుకొనే ఒకపెద్ద కుంభకోణం మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగింది. ఎవరు చేశారని నేను చెప్పడం లేదు. టి.ఆర్.ఎస్‌కు సంబంధించిన నాయకులు ఈ కుంభకోణంలో కీలకపాత్ర పోషించారు.

గొర్రెలకు మేయడానికి మేత, నీటి సదుపాయం చాలా ముఖ్యం. 1976 జాతీయ వ్యవసాయ కమీషన్ నివేదిక ప్రకారం సాగు చేసే భూమిలో 8 నుంచి 10శాతం మేత కోసం ఇవ్వవలసి ఉంటుంది. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 2 నుంచి 3శాతం మాత్రమే ఉంటున్నది. దీనిని పెంచవలసినటువంటి అవసరం ఉన్నది. రాష్ట్రంలో సెజ్‌ల పేరుతో, ఫార్మాసిటీల పేరుతో వేలాది ఎకరాలను మనం అక్వైర్ చేస్తున్నాము. దాని ద్వారా కొంత మేతకు యోగ్యమైనటువంటి భూమి పోతున్నది. ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ద్వారా సింగరేణి ప్రాంతంలోని మంచిర్యాల నుంచి పాల్వంచ వరకు ఏ భూమినైతే మేత కోసం ఉపయోగించాలనుకుంటున్నామో అది కూడా కోల్పోతున్నాము. గతంలో జి.ఓ. నెం 559ని గొర్రెల మేత కోసం విడుదల చేయడం జరిగింది. ఆ జి.ఓను అమలు పరచలేదు, అమలు పరచాలని గౌరవమంత్రిగారిని కోరుతున్నాను.

గతంలో గొర్రెల కాపరులకు తుమ్మ చెట్లపై హక్కు ఇస్తూ జి.ఓ.1016ని విడుదల చేయడం జరిగింది. మన రాష్ట్రంలో ఇప్పుడు ఆ జి.ఓను అమలుపరచడం లేదు. మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల్లో ఉన్నటువంటి తుమ్మ చెట్లను వేలం చేసి కొట్టి వేస్తున్నారు. దయచేసి మంత్రిగారు ఈ విషయంలో శ్రద్ధ వహించాలి.

**శ్రీమతి బోడిగ శోభ (చొప్పదండి):–** అభివృద్ధి కార్యక్రమ విషయమై నిన్న, నేను చొప్పదండి నియోజకవర్గంలో పర్యటించినప్పుడు అక్కడ గొల్ల, కురుమ సంఘాల ప్రజలు, సంఘాల నాయకులు గౌరవ ముఖ్యమంత్రిగారికి, మంత్రివర్యులు ఈటెల రాజేందర్‌గారికి, శ్రీనివాస్‌యాదవ్‌గారికి పాలాభిషేకం చేశారు. ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్దఎత్తున 75శాతం సబ్సిడి ఇవ్వలేదని అన్నారు. ఈ రోజు మా కష్టాలను చూసి ఆదుకుంటున్న ప్రభుత్వం మీదేనని, నియోజకవర్గమంతా పాలాభిషేకంతో ప్రభుత్వాన్ని అభినందించారు. జిల్లాలను యూనిట్‌గా చేసుకొని గొర్రెలను ఇస్తారా? నియోజకవర్గాన్ని యూనిట్‌గా చేసుకొని ఇస్తారా తెలియజేయాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. పొట్టతిప్పలు కోసం దుబాయి, మస్కట్‌కు వెళ్లిపోయి శవాలుగా తిరిగి వచ్చిన కుటుంబాలల్లో భర్తలు కోల్పోయిన మహిళలు ఉన్నారు. అందులో యాదవ కుటుంబానికి చెందిన మహిళలు మమ్మల్ని సొసైటీలో

చేర్చుకొని, మాకు ఈ స్కీమ్ వర్తింపచేయమని అడుగుతున్నారు. మనం ఇచ్చే స్కీమ్ మహిళలకు కూడా వర్తింప చేసే విధంగా మన ప్రభుత్వ పక్షాన ఆలోచన చేయాలని నేను మంత్రివర్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

గొర్రెల కాపరులు, గొర్రెలను కాస్తున్న సందర్భంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది బావుల్లో పడి చనిపోతున్నారు. గంగాధర మండలం కొండయ్యపల్లెలో ఒకరు చనిపోయారు. కొండయ్యపల్లెలో చాలా గొర్రెలు పిడుగుపడి చనిపోయాయి. ఆర్నకొండ గ్రామంలో యాదవకుటుంబంలో ఒకరు చనిపోయారు. చనిపోయిన గొర్రెల కాపరులకు మన ప్రభుత్వం ఎంత ఇన్సూరెన్స్ ఇస్తున్నది? చనిపోయిన గొర్రెలకు కూడా మన ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేసే అవకాశం కల్పించాలని నేను మంత్రివర్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:–** అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు అంజయ్యగారు, చింతా ప్రభాకర్‌గారు, పుట్టా మధుకర్‌గారు, వంశీచంద్‌రెడ్డిగారు, బోడిగ శోభగారు, చాలా అంశాల గురించి మాట్లాడం జరిగింది. ప్రధానంగా గొర్రెల కాపరుల గురించి, గొర్రెల గురించి 60 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ రోజు అసెంబ్లీలో మాట్లాడుతున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది. నేను 23 సంవత్సరాల నుంచి శాసనసభకు వస్తున్నాను కానీ, ఏ రోజు గొర్రెలు, చేపలు, అణగారిన బడుగు, బలహీన వర్గాలు, వెనుకబడిన తరగతుల గురించి మాట్లాడినటువంటి దాఖలాలు లేవు. అయినప్పటికి వంశీగారు అభినందనలు చెప్పకుండా, అనుమానాలన్నీ చెప్పారు. 60 సంవత్సరాల నుంచి మీ పార్టీ అనుమానాలతోనే వీళ్లను పైకి రాకుండా చేసింది. గొల్ల కురుమ, కుల దైవము శ్రీకృష్ణ భగవానుడు. ఈ రోజు కేసిఆర్‌గారు ఆ రూపమున వచ్చి వీళ్లను ఆదుకుంటున్నారనిపిస్తున్నది. ఎన్.సి.డి.సి స్కీమ్ 1998 సంవత్సరంలో శాంక్షన్ అయింది. కేంద్రప్రభుత్వం కౌంటర్ గ్యారంటి ఇవ్వమని అడిగింది. మహబూబ్‌నగర్‌లో ఒక పైలట్ క్రింద ఈ ప్రాజెక్టు తీసుకున్నప్పుడు కౌంటర్ గ్యారంటి ఇవ్వమని అడిగితే ఎన్నో ప్రభుత్వాలు వచ్చి పోయాయి కానీ, ఏ ప్రభుత్వం కూడా కౌంటర్ గ్యారంటి ఇచ్చినటువంటి దాఖలాలు లేవు.

11.10 ఉ. నేను ఈ పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్లాను. 3,900 చిల్లర సొసైటీలు ఏర్పడ్డాయి. వారంతా డబ్బులు కట్టారు. వారికి ప్రభుత్వం కౌంటర్ గ్యారంటీ ఇస్తే ఈ స్కీమ్ వస్తుందని వారి వద్దకు వెళితే, ముఖ్యమంత్రి గారు ఆ పేపర్ చూసిన వెంటనే వీరంతా మన తెలంగాణ బిడ్డలు, వీరికి మనం గ్యారంటీ ఇవ్వకపోతే ఎవరు ఇస్తారంటూ సంతకం చేయడంతో ఆ డబ్బులు వచ్చాయి. ఆ స్కీమ్‌ను కూడా ఇంప్లిమెంట్ చేస్తున్నాము. అందులో 60 శాతం లోను, 20 శాతం సబ్సిడీ ఉంది. 20 శాతం మాత్రం లబ్ధిదారు కట్టాలి. దాని మీద వడ్డీ కూడా 10.7 శాతం ఉంది. ఒక నెల తరువాత నేను ముఖ్యమంత్రి గారి దగ్గరకు వెళ్లి 10.7 శాతం వడ్డీ అంటే మా వాళ్లంతా ఇబ్బంది పడుతున్నారని చెప్పగానే వారు వెంటనే దాన్ని పావలా వడ్డీ క్రిందకు మార్చడం జరిగింది. మనసున్న మారాజు ముఖ్యమంత్రి గారు. చేయాలనే సంకల్పము, పేద వర్గాలను ఆదుకోవాలనే ఆలోచన ఉన్నప్పుడు తప్పకుండా సాధ్యమవుతుందని, ఈ విషయం ద్వారా నిరూపితమౌతుంది. మహబూబ్ నగర్ తోపాటు రాష్ట్రంలో ఉన్న మిగిలిన 8 జిల్లాలకు కూడా ఫేజ్–1 క్రింద రిలీజ్ చేయడం జరిగింది.

బడ్జెట్ రూపకల్పన చేస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రి గారు ఒకరోజు నన్ను పిలిచి, ఎన్.సి.డి.సి. ఫండ్స్ ద్వారా ఎన్ని డబ్బులు వస్తున్నాయి, ఎంత సబ్సిడీ వస్తోందని అడగ్గా, నేను చెప్పిన సమాధానానికి సి.ఎమ్. గారు అది సరిపోదని అన్నారు. దాదాపు రూ.4వేల కోట్లు. 3,900 చిల్లర సొసైటీలు ఉన్నా, జనాభా విషయానికి వచ్చే సరికి రమారమి 30 నుంచి 35 లక్షల మంది జనాభా ఉన్నారు. ఆ జనాభాకు అనుగుణంగా చేస్తే బాగుంటుందని అన్నారు. ఈ సొసైటీల ద్వారా కొద్ది మందికి మాత్రమే కాదు, గొర్రె కాపరులు ఎవరైతే ఉన్నారో కురుమ, యాదవ కులస్తులకు చెందిన ప్రతి కుటుంబానికి ఈ స్కీమ్ ద్వారా 75 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. ఇది భారతదేశ చరిత్రలో ఇప్పటివరకు ఎక్కడ కూడా జరుగ లేదు. కొట్టం, వ్యవసాయ భూమి, ఇల్లు, పొలం కొలాటరల్ సెక్యూరిటీ క్రింద బ్యాంకులో పెట్టుకునే పద్ధతి గత స్కీమ్‌లో ఉండేది. అయితే ముఖ్యమంత్రి గారు 75 శాతం సబ్సిడీతో పాటు ఎక్కడ కూడా బ్యాంకు వారితో టై–అప్ పెట్టుకోవద్దని చాలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

టి.వి.లలో చూస్తుంటే ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందము, ఉత్సాహాలు, సంబరాలు. 60 సంవత్సరాల చరిత్రలో ఎప్పుడు కూడా ఇంత సంతోషంగా ఉన్న దాఖలాలు లేవు. ఇక్కడ వాళ్లు ఇక్కడే కొనుక్కుంటే మాల్‌ప్రాక్టీస్ జరుగుతుందని మిత్రుడు వంశీ చంద్ చెప్పినట్టుగా, ప్రభుత్వం ముందే ప్లాన్ చేసింది. మన రాష్ట్రం నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకు రావాలని, మా అధికారులను, సొసైటీకి సంబంధించిన, కులానికి సంబంధించిన వారిని కూడా తీసుకు వెళ్లి అంతా స్టడీ చేసి రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలో గొర్రెలు పుష్కలంగా ఉన్నాయి. అనుమానాలు వద్దు, చేయాలనే సంకల్పం ఉంటే తప్పకుండా చేసి

చూపిస్తాము. పారదర్శకంగా చేస్తాము. ఎక్కడ కూడా ఇబ్బంది పడకుండా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమాలు చేసి చూపిస్తాము. పెద్దలు ఈటల రాజేందర్ గారు మొన్న బడ్జెట్ అనౌన్స్‌మెంట్ చేయగానే, నిన్న వేలాది మంది ముఖ్యమంత్రి గారి దగ్గరకు వచ్చి కృతజ్ఞతలు చెప్పడం జరిగింది.

గొర్రె పిల్లలను తీసుకు రావడమే కాకుండా మేత విషయంలో, మందుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా వెటర్నటీ హాస్పిటల్స్‌ను బలోపేతం చేసేందుకు గాను, మొన్న 161 మంది స్టాఫ్‌ను పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా తీసుకోవడం జరిగింది. ఇంకా కూడా తీసుకోబోతున్నాము. ఇవీ కాకుండా ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్ మినహాయించి, 119 నియోజకవర్గాలకు గాను, 100 నియోజకవర్గాల్లో మొబైల్ వెహికల్స్ మీ ముందుకు అందుబాటులోకి రాబోతున్నాయి. అందులో కచ్చితంగా ఒక డాక్టర్, కాంపౌండర్, మెడిసిన్ అన్నీ కూడా అందుబాటులో ఉంటాయి. ఈ వర్గాలను ఆదుకోవాలనే సంకల్పము గత ప్రభుత్వాలకు ఉన్నట్లుగా చరిత్రలో లేదు. ఈరోజు కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు పెద్దలు ఇంకా గొర్రెలను, చేపలను పెంచాలా అనే విధంగా మాట్లాడుతున్నారు. మీ దిక్కుమాలిన ప్రభుత్వాలు చేసిన కర్మకు బడుగు బలహీన వర్గాలు ఇంకా అడుక్కునే స్థితిలోనే ఉన్నాయి. ఏదో ఎన్నికలు రాగానే ఇంత బిక్షవేశారే తప్ప, ఏరోజు కూడా మనస్ఫూర్తిగా వీరిని ఆదుకోవాలని, వీరిని ఆర్థికంగా ముందుకు తీసుకు వెళ్లాలని, వీరిని బలోపేతం చేయాలనే ఆలోచన మీరు చేయలేదు. బడుగు బలహీన వర్గాల కోసం ఈ ప్రభుత్వం 119 గురుకుల పాఠశాలలను ఈ సంవత్సరం నుంచి ప్రారంభిస్తోంది.

ఇప్పుడిప్పుడే తెలంగాణ గ్రామాల్లోని పిల్లలు ఓవర్‌సీస్ చదువులు చదువుకుంటున్నారు. గతంలో వారు పై చదువులకు ఇతర దేశాలకు వెళ్లి చదువుకోవాలంటే ఎలాంటి స్కీమ్ ఉండేది కాదు. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులు, సంవత్సరానికి 300 వందల మందికి ఒక్కొక్క విద్యార్థికి రూ.20 లక్షల చొప్పున ముఖ్యమంత్రి గారు స్కీమ్‌ను ప్రవేశ పెట్టారు. కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఎస్.సి. ఎస్.టి.లతో పాటు బి.సి.లకు కూడా ఈ సంవత్సరం నుంచి వర్తింప చేస్తున్నారు.

**మిస్టర్ స్పీకర్:–** మంత్రి గారు సబ్జెక్టుకు సంబంధించి మాట్లాడండి.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:–**ఇదంతా కూడా సబ్జెక్టులో లేకపోయినప్పటికీ ఈ వర్గాలను ఈ ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటోందో చెబుతున్నాను అధ్యక్షా. ఈ ప్రభుత్వం అన్ని విధాలా ఆలోచన చేసి వేరే రాష్ట్రాల నుంచి గొర్రెలు వస్తే ఇన్సూరెన్స్ చేస్తున్నాము. జియో ట్యాగింగ్ చేస్తున్నాము. ఇక్కడకు వచ్చిన తరువాత ఇక్కడ గొర్రెలు అక్కడ గొర్రెలు అని ఇబ్బంది కలగకుండా ఇన్ఫ్నీ చేస్తున్నాము. మన వాతావరణానికి అనుకూలంగా ఉండే గొర్రెలను మాత్రమే కొనుగోలు చేస్తున్నాము. ఎవ్వరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదు. ఎండా కాలం వచ్చినప్పుడు కాని, కరువు వచ్చినప్పుడు కాని చాలా ఇబ్బందులు వస్తున్నాయి. పశుగ్రాసం విషయంలో కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. కరువు ఉన్నప్పుడు ప్రక్క రాష్ట్రాల నుంచి గడ్డి కొనుక్కొని పంపిణీ చేస్తున్నాము. అందుకే ఈ సంవత్సరము నుంచి ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు, రాష్ట్రంలో ఉన్న ఈ కుటుంబాల్లో ఎవరికైతే ఎకరం లేదా అర ఎకరం, రెండు ఎకరాలో ఉంటే వారు వారి పొలంలోనే గడ్డి పెంపకం చేపడితే వారికి 75 శాతం సబ్సిడీతో సీడ్ ఇచ్చే విధంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది.

ఎస్.సి., ఎస్.టి.లు ఇతర కులాల వారు కూడా ఈ జీవన విధానం మీద ఆధారపడుతున్నారనే విషయం మిత్రులు చెప్పడం జరిగింది. కురుమ యాదవులకు ఈ కార్యక్రమాన్ని వర్తింప చేస్తూనే, ఎవరైతే ఎస్.సి. ఎస్.టి. లు, ఇతర కులాల వారు ఈ వృత్తి మీద ఆధారపడి ఉన్నారో వారికి కూడా ఎస్.సి. ఎస్.టి. సబ్–ప్లాన్ క్రింద తప్పకుండా మంజూరు చేద్దామని ముఖ్యమంత్రి గారు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అటవీ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి గారు ఇప్పటికే సర్వే చేయించారు. అడవుల్లో భూమి ఎంత ఉంది. హరితహారం క్రింద అక్కడ కూడా చెట్లను పెంచే కార్యక్రమాన్ని చేపడుతూ, అదేవిధంగా "స్టైలో ఎమటో" రకం విత్తనం వేస్తే ఉపయోగపడుతుందని.... ఇంతకు ముందు ఒక మిత్రుడు చెప్పాడు, జి.ఓ.లు ఇచ్చారని, జి.ఓ.లు కాదు ముఖ్యం ఇంప్లిమెంటేషనే ముఖ్యము. ఎక్కడ కూడా జి.ఓ.లు, జీవం లేకుండానే ఉన్నాయి, అటవీ ప్రాంతంలో కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ముఖ్యమంత్రి గారు సూచనలు చేయడం జరిగింది. ఆ రికార్డ్సు అన్నీ కూడా తెప్పించుకోవడం జరిగింది.

పెద్దలు అంజయ్య గారు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. క్రింద ఏమైనా షెడ్‌లు కడతారా అని ప్రశ్నించారు. ఆ విషయం మీద మొన్న సబ్ కమిటీ మీటింగ్‌లో పంచాయతీ రాజ్ మంత్రి గారిని కూడా రిక్వెస్ట్ చేయడం జరిగింది. ఈ స్కీమ్‌ను ఇంప్లిమెంట్ చేయడానికి నేనొక్కడినే కాదు, 8 మంది మంత్రులను సబ్ కమిటీలో ముఖ్యమంత్రి గారు వేశారు. అందరి అనుభవాలు తీసుకొని పకడ్బందీగా దీన్ని

అమలు చేయాలి. ఈ జాతులు గర్వ పడే విధంగా, వారు ఆనందంగా ఉండే విధంగా ఈ కార్యక్రమం అమలు జరగాలి. కాబట్టి మిత్రులందరూ సహకరించండి. నెగిటివ్‌గా మాట్లాడితే మీ నియోజక వర్గంలో కూడా అదే వాతావరణం నెలకొంటుంది. దయచేసి గుర్తు పెట్టుకోండి. ఈ కార్యక్రమము ఏదో ఒక పది మందో 20 మందిదో కాదు. కల్వకుర్తి నియోజక వర్గంలో చాలా పెద్ద ఎత్తున వారే ఉన్నారని మిత్రులు గుర్తు పెట్టుకోవాలని తెలియజేస్తున్నాను. సొసైటీల విషయంలో ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గత 23 సంవత్సరాల నుంచి సొసైటీలు ఉన్నాయి. ఆ విషయంలో గౌరవ శాసన సభ్యులు కాని ఎవ్వరూ కూడా భయపడాల్సిన అవసరం లేదు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. రాజకీయం, రాజకీయ పార్టీలు అనే ఆలోచన లేదు. ఈ రాష్ట్రంలో ఉన్న కురుమ కులాలకు సంబంధించి ప్రతి కుటుంబానికి కచ్చితంగా ఈ స్కీమ్ అందే విధంగా కార్యక్రమం చేపట్టబోతున్నాము.

## 11.20 ఉ. బలహీన వర్గాల గృహ ఋణాల మాఫీ

ప్రశ్న నెం.7(2247)

సర్వశ్రీ మేముల వీరేశం (నక్రేకల్), దుర్గం చిన్నయ్య (బెల్లంపల్లి), అంజయ్య ఎల్లగమోని, శ్రీమతి అరుణ డి.కె. (గద్వాల్), సర్వశ్రీ తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి తాటిపర్తి :– గౌరవనీయులైన గృహ నిర్మాణ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియ చేస్తారా?

అ) బలహీన వర్గాల గృహ నిర్మాణ పథక లబ్ధిదారులు చెల్లించే గృహ రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే మాఫీ చేసిన మొత్తం పరిమాణం, తద్వారా లబ్ధి పొందిన పేదల సంఖ్య ఎంత?

ఇ) ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు బిల్లులను పరిష్కరించలేదన్న విషయం కూడా వాస్తవమేనా?

ఈ) అయితే ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గృహనిర్మాణ శాఖామాత్యులు (శ్రీ ఎ. ఇంద్రకరణ్ రెడ్డి) :–
అ) అవునండీ.

ఆ) బలహీన వర్గాల గృహ నిర్మాణ రుణాన్ని మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 29,64,435 మంది లబ్ధి దారులకు రూ.3,920.56 కోట్ల మొత్తాన్ని మాఫీ చేయడమైంది.

ఇ) లేదండీ.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ వి. వీరేశం:–** బలహీన వర్గాల గృహ నిర్మాణానికి సంబంధించిన రుణమాఫీ చేశారు. వాటిలో ఎన్ని గృహాలకు రుణమాఫీ చేశారు? ఎంత డబ్బు మాఫీ చేశారనే వివరాలు చెప్పాలి. గృహ నిర్మాణ రంగంలో గతంలో చాలా అవకతవకలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. దాని మీద ఎంక్వైరీ వేశారని అన్నారు. ఆ రిపోర్టు ఏమి వచ్చింది? ఎంతమంది మీద చర్య తీసుకున్నారు? ఎంత అవినీతి జరిగింది. దానికి గల కారణాలేమిటి?

**శ్రీ డి. చిన్నయ్య:–** 2004 నుండి 2014వరకు 24,91,870 గృహాలు పేదలకు నిర్మించామని ప్రభుత్వ రికార్డు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత పేద ప్రజలకు ఎన్ని ఇళ్లు కట్టించారని ఎంక్వైరీ చేస్తే 2,46,178మందికి కట్టారని అధికారులు చెప్పారు. ఇందులో 56వేల 59 ఇళ్లు నిర్మాణం పూర్తి అయ్యాయని, 2,04,000 ఇళ్ల నిర్మాణం వివిధ దశలలో ఉన్నాయని అప్పుడున్న అధికారులు చెప్పడం జరిగింది. నిజంగా కట్టుకున్న వారికి బిల్లులు కూడా ఇంతవరకు రాకుండా ఉంటే మన ముఖ్యమంత్రిగారు పెద్ద మనసుతో 3,69,048 కోట్లు ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు చెల్లిస్తామని గత సమావేశంలో ప్రకటించారు. వాటిని పూర్తిగా చెల్లించారా, ఇంకా మిగిలి ఉన్నాయా? ఇప్పుడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ముఖ్యమంత్రిగారు ప్రతి నియోజక వర్గానికి ఇస్తున్నారు. ఎన్ని నియోజక వర్గాలలో అవి మొదలయ్యాయి? ఇంకా ఆ పథకం ముందుకు సాగడానికి ఏ ఏ కార్యక్రమాలు చేస్తున్నారో మంత్రిగారు చెప్పాలని కోరుతున్నాము.

**శ్రీమతి డి.కె. అరుణ:–** ముఖ్యమంత్రిగారు గత అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల రుణాలను మాఫీ చేస్తున్నట్లు, అదేవిధంగా రాజీవ్ స్వగృహ, రాజీవ్ గృహకల్ప ఇళ్లకు సంబంధించిన లోన్స్‌ను మాఫీ చేస్తున్నామని ప్రకటించారు. మంత్రిగారు వాటిని మాఫీ చేయడం జరిగిందని చెప్పారు. వారి అకౌంట్‌లో రుణ మాఫీ జరిగిందని పత్రాలు పంపించారా? ఇందిరమ్మ ఇళ్లలో ఏప్రిల్ 24, 2014 నుండి ఏప్రిల్ చివరి వరకు అప్పటి వరకు మొత్తం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు 4,94,328 ఉన్నాయని తేలింది. తరువాత జిల్లాల వారీగా కలెక్టర్స్ వెరిఫికేషన్ చేసిన తరువాత అర్హత ఉన్నటువంటి ఇళ్లను 4,65,000 అని చెప్పడం జరిగింది. జిల్లాల వారీగా కలెక్టర్స్ వెరిఫై చేసిన తరువాత ఇంత వరకు కేవలం బిల్లులు చెల్లించిన గృహాల సంఖ్య 14,309 మాత్రమే. ఇంకా 4, 50,691 ఇళ్లకు ఇంకా బిల్లులు చెల్లించవలసి ఉంది. అదేకాకుండా మంజూరై ఆన్‌లైన్‌లో స్టాండర్డ్ లేని వాటిని కూడా వెరిఫై చేయాలని కోరడం జరిగింది. మొత్తం ప్రభుత్వానికి

వెరిఫికేషన్ చేసిన తరువాత ఇంతవరకు ఎన్ని ఇళ్లకు బిల్లులు చెల్లించకుండా ఉన్నాయి? ఆ ఇళ్ల యొక్క బిల్లులు ఎప్పటి లోగా చెలిస్తారు. ప్రతి అసెంబ్లీ సమావేశాలలో ఆ ఇళ్లకు సంబంధించిన బిల్లులను చెల్లిస్తామని చెప్పడం జరిగింది. ఇంకా బిల్లులు చెల్లించకపోవడానికి కారణాలేమిటి? ఇళ్ల వెరిఫికేషన్ చేసిన తరువాత బిల్లులు చెల్లించకుండా ఎందుకు పక్కన పెట్టారు? అటువంటి ఇళ్ల సంఖ్య ఎంత? ఎప్పటిలోగా ఇందిరమ్మ ఇళ్లకు వెరిఫికేషన్ పూర్తి అయి పునాది లెవెల్‌లో, లెంటల్ లెవెల్‌లో, పూర్తి అయిన ఇళ్లకు ఎప్పటిలో ఆ బిల్లులు చెల్లిస్తారో చెప్పాలని కోరుతున్నాను. రెండు బెడ్ రూమ్స్ ఇళ్ల గురించి ముఖ్యమంత్రిగారు గత అసెంబ్లీలో ఈ సంవత్సరం పెద్దయెత్తున ప్రారంభం చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు క్రింది స్థాయిలో దానికి సానుకూలమైన పనులు జరగడం లేదు. వాటిని కట్టడానికి కాంట్రాక్టర్స్ ముందుకు రావడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల కోసం వారంతా చెప్పులరిగేలా తిరుగుతున్నారు. ఆ బిల్లులు చెల్లించడం లేదు. కొత్త ఇళ్లు లేవు. ప్రజలు రెండు బెడ్ రూమ్ ఇళ్ల మీద ఆశ పెట్టుకున్నారు. ఇప్పటికే మూడు సంవత్సరాలైంది, ఇంకా రెండు సంవత్సరాలు మాత్రమే ఉందని, ఎప్పుడు ఇళ్లు కట్టుకుంటామని చాలామంది ఆశతో ఎదురుచుస్తున్నారు. అప్పులు చేసి కట్టారని ప్రభుత్వం చెప్పింది. ఇందిరమ్మ ఇళ్లని...............

**శ్రీ టి. హరీష్‌రావు:–** సింగిల్ సప్లిమెంటరీ ఇది. ఒక్కొక్కరికి ఇంత సమయం ఇస్తే ఎలా?

**శ్రీమతి డి.కె. అరుణ:–** వారు మాత్రం ఒక్కో సబ్జక్ట్ మీద గంటలు గంటలు మాట్లాడవచ్చు. ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు కట్టమంటే ఎందుకంత బాధ వారికి? ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు చెల్లించదలచుకోలేదా? చెప్పమనండి. ఎందుకంత బాధ? మంత్రిగారు లోపలికే వస్తూనే అంటున్నారు. ప్రతిపక్షం వాళ్లు మాట్లాడవద్దన్న విధంగా మాట్లాడుతున్నారు. ఏమి పద్ధతి ? ఆయన లోపలికి అడుగు పెట్టగానే అలా అనడం బాగా లేదు.

**మిస్టర్ స్పీకర్:–** క్వశ్చన్ అవర్‌లో గురించి అందరూ సుదీర్ఘమైన స్పీచ్‌లు ఇస్తే ఎలా? క్వశ్చన్ అవర్ గురించి ఎలా మాట్లాడాలో చెప్పాలంటే ఎలా? సభ నడపడం కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. మీరు చెప్పవలసిన పాయింట్ చెప్పండి.

**శ్రీమతి డి. కె. అరుణ:–** వారు మధ్యలో మాట్లాడడం ఎందుకు? నేను సబ్జక్ట్ డీవియేట్ కాలేదు. వారికి బాధ కలుగవలసిన అవసరం ఏముంది. రన్నింగ్ కామెంటరీ బంద్ చేయించండి.

(అంతరాయం)

ఒకరు మాట్లాడుతుంటే పది మంది మాట్లాడితే ఇదేం పద్ధతి? ఇందిరమ్మ ఇళ్లకు ఎప్పటిలోగా బిల్లులు చెల్లిస్తారు? చెల్లిస్తారా, లేదా? చెల్లిస్తామని ఎందుకు చెల్లించలేదు. వారంతా ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారు. అప్పులు చేసి, బయట వడ్డీలకు తెచ్చి ఇళ్లు కట్టుకున్నారు. వారి మీద ముఖ్యమంత్రిగారికి కనికరం లేదు. ఆ బిల్లులు కట్టకుండా ఎందుకు పెండింగ్ పెడుతున్నారు?

**శ్రీ ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి:–** వీరేశంగారు, చిన్నయ్యగారు, అరుణగారు గృహనిర్మాణంపై ప్రశ్నలు అడిగారు. గౌరవ ముఖ్యమంత్రిగారు తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాల నుండి గృహ నిర్మాణ కార్యక్రమం అమలు చేశారు. షెడ్యూల్డ్ కులాల వారు 4,48,891 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి రూ. 585.63 కోట్లు చెల్లించారు. 29,64,435 మంది లబ్ధి దారులకు రూ.3,920.56 కోట్ల మొత్తాన్ని మాఫీ చేయడమైంది.

**11.30 ఉ.** ఎస్.టీలకు సంబంధించి 3,80,435 లబ్ధిదారులకు గాను రూ. 450.38 కోట్లు, మైనారిటీలకు సంబంధించి 16,088 లబ్ధిదారులకు రూ. 264.80 కోట్లు, బీసీలకు సంబంధించి 13,50,694 లబ్ధిదారులకు గాను 1580.73 కోట్లు, ఇతర 7,68,327 లబ్ధిదారులకు రూ. 1021.28 కోట్లు, మొత్తం 29,64,435 లబ్ధిదారులకు గానూ రూ. 3,920.56 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం క్రింద వివిధ దశలలో ఉన్న గృహాలకు, అర్హత కలిగిన ప్రకారం, బిల్లులు చెల్లించుటకు జిల్లాకలెక్టర్లకు సూచనలు ఇవ్వడం జరిగింది. ఆ ప్రకారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ టీములు అర్హత కలిగిన లబ్ధిదారుల పేర్లను పరిశీలించి డిపార్ట్‌మెంట్‌కు సిఫార్సు చేస్తున్నారు. తేదీ 2.6.2014 నాటికి ఇందిరమ్మ పథకంలో పూర్తి కాని గృహములు 4,49,252 అధ్యక్షా. రెవెన్యూ అధికారుల బృందంచే పరిశీలించబడిన గృహములు 3,20,981, డెప్యూటి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లచే పరిశీలించబడిన గృహములు 3,66,609, రెవెన్యూ అధికారుల బృందంచే ఇంకా పరిశీలించవలసిన గృహాలు 1,19,307, పరిశీలనా సమయంలో అనర్హులుగా గుర్తించబడిన గృహాలు 1,19,307, పరిశీలనా సమయంలో అర్హులుగా గుర్తించబడిన గృహాలు 2,46,170 అధ్యక్షా. అదే విధంగా ఆర్ అండ్ ఆర్ పథకం కింద 2.6.2014 తరువాత మంజూరైన గృహాలు 13,988 ఉన్నాయి అధ్యక్షా. తేదీ 30.11.2016 నాటికి అర్హులుగా గుర్తించబడిన మొత్తం గృహాలు 2,60,168, నిర్మాణము పూర్తి కాబడిన గృహాలు 56,059, లబ్ధిదారులకు చెల్లించిన మొత్తం రూ. 369.48 కోట్లు, వివిధ దశలలో నిర్మాణములో ఉన్న గృహములు 2,04,109, మిగిలిన గృహాలు పూర్తి

చేయుటకు అవసరముగు నిధులు రూ. 1159.85 కోట్లు, అందుబాటులో ఉన్న నిధులు రూ. 567.39 కోట్లు అధ్యక్షా. తెలంగాణలో 31 జిల్లాలు అయిన తరువాత జిల్లా కలెక్టర్స్ అందరికీ ఒక సీనియర్ నోడల్ అధికారిని నియమించుకోవాలని ఉత్తర్వులు పంపించడం జరిగింది. ఆ నోడల్ ఆఫీసర్‌తోబాటు, హౌసింగ్ వెబ్‌సైట్ ఐడీ, పాస్‌వర్డ్ కూడా ఇవ్వడం జరుగుతోంది. సంబంధిత తహశీల్దారు, సహాయక ఇంజనీర్ (పంచాయత్ రాజ్) బృందం అర్హులైన లబ్దిదారుల జాబితాను గుర్తించి, నిర్మాణాలను పరిశీలించి, దశల వారీగా నిర్మాణ స్థాయికి అనుగుణంగా నగదు విడుదలకు సిఫార్సు చేస్తారు. ఈ విధంగా కలెక్టర్లకు ఆదేశాలివ్వడం జరిగింది. తప్పులు జరగకుండా, నోడల్ అధికారులను పెట్టుకొని, పనులు చేయించే విధంగా కలెక్టర్లకు బాధ్యతను అప్పజెప్పడం జరిగింది. జిల్లాల కలెక్టర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సహాయంతో పరిశీలన జరిపి, బిల్లులు చెల్లించడం జరుగుతోంది. డబ్బులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఎవరైతే నిర్మాణాలు కంప్లీట్ చేసుకున్నారో వారికి అతి తొందరలో పేమెంట్స్ చేస్తాము. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 70 వేల ఇళ్లకు సంబంధించి టెండర్లు పిలవడం జరిగింది. ఎక్కడా ఏ విధమైన సమస్య లేదు. అనుకున్న దానికంటే ముందే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను. ఇప్పటికే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మొదలయ్యాయి. కొత్తగా ఒకొక్క అసెంబ్లీ సెగ్మెంట్‌కి వెయ్యి ఇళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి గారు చెప్పారు కాబట్టి పెద్ద సంఖ్యలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదవారికి, గూడు లేని వారికి అందిస్తామని తెలియజేస్తున్నాను.

MR. SPEAKER: - Question Hour is over.

## సభా కార్యక్రమము

### వాయిదా తీర్మానాల అనుమతి గురించి

1. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను చర్చించాలని కోరుతూ శ్రీ జి. కిషన్ రెడ్డి, శ్రీ సున్నం రాజయ్యలు ఇచ్చిన వాయిదా ప్రతిపాదనలు తిరస్కరించడం జరిగింది.

## ప్రకటన

### కోత తీర్మానాల స్వీకరణ గురించి

I am to announce to the House that Cut Motions to the Demands for Grants for Budget 2017-18 will be received upto 04.00 PM of Thursday, the 16th March, 2017.

Now Tea Break for 15 Minutes.

(The House then adjourned for Tea at 11.36 AM)

12.00 మ. (తేనీటి విరామానంతరం సభ తిరిగి 12.00లకు ప్రారంభమైనది. గౌరవ ఉప సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

**.MADAM DY.SPEAKER: -** Please resume your seats. Now, General Discussion on Annual Financial Statement. Kishan Reddy Garu.

## .2017- 2018 సంవత్సరపు వార్షిక ఆదాయ–వ్యయ పట్టిక (బడ్జెట్)పై – సాధారణ చర్చ (మొదటి రోజు)

**.శ్రీ జి. కిషన్ రెడ్డి(అంబర్‌పేట):–** అధ్యక్షా, జనరల్ బడ్జెట్‌లో ప్రతిపక్షం తరపున ముందుగా మాట్లాడటానికి అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ, ఇప్పటికే 2014-15, 2015-16, 2016-17 అంటే ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్ పాస్ చేసుకుంటే మూడవ బడ్జెట్ పూర్తయిపోతుంది. ఇక మిగిలేది 2018 సంవత్సరం బడ్జెట్ ఒకటే. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన నాలుగవ బడ్జెట్ ఇది. ఎందుకంటే వచ్చే సంవత్సరం ఎలక్షన్ మూడ్ వచ్చేస్తుంది. కాబట్టి ఈ సంవత్సరం బడ్జెట్ చాలా కీలకమైన బడ్జెట్. టీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ముందు వారి మేనిఫెస్టోలో ప్రజలకిచ్చిన హామీలను అమలుచేసే విధంగా ఈ బడ్జెట్‌లో పొందుపరుస్తారని తెలంగాణ ప్రజలందరూ ఎంతో ఆశతో ఎదురు చూశారు. ఎందుకంటే టీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో మొదటిసారిగా అధికారంలోకి వచ్చింది. కాబట్టి వాళ్లకు కొంత సమయమివ్వాలని మొదటి రెండు సంవత్సరాలు ప్రజలు భావించారు. కానీ వాస్తవంగా మనది ఎస్టాబ్లిష్డ్ స్టేట్. మనకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా మనకు అన్ని రకాల సౌకర్యాలున్నాయి, యంత్రాంగమున్నది, కేవలం అధికార పార్టీ, ముఖ్యమంత్రి మారారు, పేరు మారింది. అయినప్పటికీ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకొని నాలుగవ బడ్జెట్‌లో అడుగుపెట్టిన ఈ నేపథ్యంలో కచ్చితంగా టీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలన్నింటిని ఈ బడ్జెట్‌లో పొందుపరిస్తే బాగుండేది, పొందు పరుస్తారని కూడా ప్రజలు ఊహించారు. వాస్తవంగా ఆ దిశలో ఈ బడ్జెట్ లేదనే విషయం అర్థమవుతున్నది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 34 నెలలు పూర్తయింది. ఎందుకంటే టీఆర్ఎస్ పార్టీ ఒక సగటు రాజకీయ

పార్టీ కాదు. కొన్ని లక్షల మంది త్యాగాలతో, కొన్ని వందల మంది బలిదానాలతో అన్ని రకాల ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన ఈ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన తొలి ప్రభుత్వం.

ఇప్పటి మన ముఖ్యమంత్రి గారు చేసిన ఉద్యమం కారణంగానో లేదంటే టీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమం కారణంగానో తెలంగాణ రాష్ట్రం ఏర్పడలేదు. ఈ రాష్ట్రంలో ఉన్న సకల జనులు, అన్ని ప్రజా సంఘాలు, అన్ని కుల సంఘాలు, అన్ని విద్యార్థి సంఘాలు, అన్ని కార్మిక సంఘాలు కలిసి పోరాటాలు చేస్తే ఏర్పడిన ఈ తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలన్నింటిని అమలు చేయాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉన్నదనే విషయాన్ని గుర్తుచేస్తున్నాను. ఈరోజు వాళ్లెవరు, వీళ్లెవరు, వాళ్లెంత, వీళ్లెంత అనేటటువంటి ఆలోచన ఈ ప్రభుత్వానికి రాకూడదు. తెలంగాణ ఉద్యమంలో ఏ రకంగా అందరం కలసిమెలసి పనిచేశామో ఈ తెలంగాణ అభివృద్ధికి కూడా సకల జనులతో కలిసి ఈ ప్రభుత్వం పనిచేయాలన్సిన బాధ్యత ఉన్నది. ఆ రకంగానే సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరమున్నది. కానీ ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకొని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "నీళ్లు, నిధులు, నియామకాలు" అనే నినాదంతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం జరిగింది. అన్నింటికంటే తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవం, తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, తెలంగాణకు జరిగిన అన్యాయం మీద పోరాటం జరిగిందనే భావజాలంతో ఉద్యమంలో తెలంగాణ ప్రజలంతా పాల్గొన్నారు. ఉద్యోగాల కోసమో, భూమి కోసమో ఆరోజు ఏ ఒక్కరు కూడా ఆత్మహత్యలు చేసుకోలేదు. మన తెలంగాణకు అప్పటి పాలకులు అన్ని రకాలుగా అన్యాయం చేశారనే ఆందోళన, ఆవేశంతో ఆరోజు వందలాది మంది ఆత్మబలిదానాలు చేసుకున్న చరిత్రను గుర్తుచేస్తున్నాను. కానీ ఈ ప్రభుత్వ కార్యక్రమాలను, నిర్ణయాలను, అమలుతీరును ఏకీభవించనివారు ఎవరైనా ఈ ప్రభుత్వ పనితీరును విమర్శించినా, సూచనలు చేసినా ఈ ప్రభుత్వం ఎదురుదాడి చేస్తున్నది. అది మంచి సాంప్రదాయం కాదనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ఏ పోరాటాల కారణంగా అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిందో అటువంటి పార్టీ ఇప్పుడు ఇందిరాపార్కు దగ్గర ఉన్న ధర్నాచౌక్‌లో ధర్నాలు చేయనివ్వం, ధర్నాలు చేయాలంటే శంషాబాద్‌లో చేసుకోండి లేదంటే మల్కాజిగిరిలో చేసుకోండి అని చెప్పడం ఎంతవరకు న్యాయం? ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతున్నాను.

ఆర్థిక శాఖామంత్రిగారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం అంకెలు మారాయి. చాలా పేజీలలో గత సంవత్సర బడ్జెట్ ఉపన్యాసమే పునరావృతమై అవే పదాలున్నాయి. ఇది భారీ బడ్జెట్ అన్నారు కానీ వాస్తవానికి ఇది బడాయి బడ్జెట్. 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.1 లక్షా 49 వేల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఇది భారీ బడ్జెట్ అంటున్నారు.

**12.10 ని.** 2016-17 సంవత్సరానికి ఇదే సభలో ఇదే మంత్రి గారు లక్షా ముప్పై వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టగా, ప్రభుత్వ లెక్కల ప్రకారం అది లక్షా పన్నెండు వేల కోట్ల రూపాయలకు కుదించినట్లు వాస్తవ బడ్జెట్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఆ మొత్తం మరింతగా తగ్గి లక్ష కోట్ల రూపాయలకే చేరే అవకాశం ఉంది. 2016-17వ సంవత్సరానికి పది శాతం వృద్ధి రేటు నమోదైనదని, 2017-18వ సంవత్సరానికి అది మరింతగా పెరిగి 12 శాతంగా వృద్ధి నమోదౌతుందని చెప్పారు. 2016-17వ సంవత్సరం ఖర్చుపై 12 శాతం అనగా గతం కన్నా 13,462 కోట్లు అధికంగా ఖర్చౌతుందనుకుంటే ఈ బడ్జెట్ అంచనాలు 1,25,653 కోట్లకు మించి ఉండటానికి వీలు లేకున్నప్పటికీ, ఈ ప్రభుత్వం 1,49,000 కోట్ల రూపాయల బడ్జెట్‌ని ప్రవేశ పెట్టింది. అదనంగా, కృత్రిమంగా ఈ బడ్జెట్ అంకెలను పెంచుకొని బడ్జెట్ ప్రవేశ పెట్టిందని తెలంగాణ ప్రజలు కోడై కూస్తున్నారు. కావున, ఇది భారీ బడ్జెట్ కాదని, బడాయి బడ్జెట్ అని మనవి చేస్తున్నాను.

గత బడ్జెట్‌లో ప్రణాళిక పద్దు కింద 67,630 కోట్లను ప్రకటించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం డిసెంబర్, 2016 వరకు, 34,472 కోట్లే ఖర్చు చేశారు. 2017 సంవత్సరంలోని ఈ మూడు నెలలకు సగటున 4,000 కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేసినా, మొత్తం కలిపి 46,472 కోట్లకు మించి ఖర్చు కాదు. అనగా, 67,630 కోట్లకు మీ లెక్క ప్రకారమే మీరు ఖర్చు చేసేది 46,472 కోట్లకు మించదని రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు, ప్రభుత్వాధికారులు, మేము మరియు ప్రజలు కూడా అనుకుంటున్నారు. దీని ప్రకారం గత సంవత్సరం మీరు చెప్పిన దాంట్లో 68 శాతం కంటే ఎక్కువ ఖర్చవదని ఈ ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. 2015-16వ సంవత్సరంలో ప్రణాళిక పద్దు ద్వారా 50,280 కోట్లు ఖర్చు చేస్తామని 36,129కోట్లను మాత్రమే, అనగా 71 శాతమే ఖర్చు చేశారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి 65 నుంచి 70 శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నందున మీరు ప్రవేశ పెట్టిన బడ్జెట్ మరియు పథకాలపై ప్రజలకు ఏ రకంగా నమ్మకం ఉంటుంది. లేనిది ఉన్నట్లుగా చూపించి శాసనసభ సాక్షిగా ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

విలువ ఆధారిత పన్ను ద్వారా 2016-17వ సంవత్సరంలో 42,000 కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, మరల సవరించి 37,000 కోట్ల ఆదాయమే వస్తుందని తెలియజేశారు. ఆ 37000 కోట్ల రూపాయల వ్యాట్ వసూళ్లు దేశంలోనే అత్యధికంగా వసూలయ్యాయని చెబుతున్నారు. కానీ, 2017-18వ సంవత్సరం బడ్జెట్‌లో 46,469 కోట్లను రాబట్టుకుంటామని చెప్పిన విషయం ఏవిధంగా సాధ్యమౌతుంది, ఇది కేవలం అంకెల గారడి కాదా, వ్యాట్ మీద ఈ విధంగా అంకెలను పెంచుకొని ఆదాయం వస్తుందని చెబుతున్నారు. ఈ వర్తమాన సంవత్సరంలో వచ్చిన అనుభవంతోనైనా 2017-18 బడ్జెట్‌కు వాస్తవ అంకెలు పెడితే బాగుండేదని మనవి చేస్తున్నాను. 2016-17వ సంవత్సరంలో పన్నేతర ఆదాయాన్ని 14,411 కోట్లుగా చూపించారు. మూడు వేల కోట్ల రూపాయలు మినరల్స్ నుంచి, మరో రెండు వేల కోట్ల రూపాయలు ఇతర మార్గాల ద్వారా వచ్చినప్పటికీ, మిగతా తొమ్మిది వేల కోట్ల రూపాయలు ఏవిధంగా వచ్చాయనే విషయాన్ని తెలియజేస్తే సంతోషించేవాళ్లము. 2015-16వ సంవత్సరంలో 530 కోట్ల రెవెన్యూ మిగులుగా ఉంటుందని ఇదే సభలో ప్రవేశ పెట్టారు. మనది ధనిక రాష్ట్రం, మిగులు బడ్జెట్ గల రాష్ట్రం అని చెప్పినప్పుడు ప్రజలందరూ ఆ విషయాన్ని విశ్వసించారు. తీరా చూస్తే 2015-16వ సంవత్సరంలో 4,304 కోట్ల లోటు బడ్జెట్ అని మీరే చెప్పారు. ఈ విషయాలన్నింటిని ఇదే సభలో మీరు అందించిన కాగ్ రిపోర్ట్‌లో చెప్పారు.

ఎఫ్.ఆర్.బి.ఎమ్. పరిమితిని మూడు నుంచి మూడున్నర శాతానికి పెంచుకోవడానికి, అప్పులు చేయడానికి లెక్కలను మరింతంగా పెంచి చూపిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు. మద్యం ద్వారా అనగా వైన్ షాపుల వేలం మరియు బార్ షాపుల ఫీజుల ద్వారా 9,000 కోట్ల రూపాయలు, మద్యం అమ్మకాల పన్ను ద్వారా మరో పది వేల కోట్ల రూపాయలు వస్తాయని ఈ బడ్జెట్‌లో అంచనా వేశారు. 19,000 కోట్ల రూపాయలు మద్యం నుంచే రాబట్టుకోవాలని ఈ ప్రభుత్వం ఈ రోజు ఆలోచిస్తోంది. రాష్ట్ర ఆదాయం 69,000 కోట్లల్లో సుమారు 28 శాతం అనగా 19,000 కోట్ల రూపాయలు మద్యం నుంచే రాబట్టాలని చూసే విషయాన్ని ఆలోచించాల్సి ఉంది. ప్రజల ఆర్థిక వ్యవస్థను మరియు ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి, బస్తీల్లో వయస్సులో ఉన్న పెళ్లైన యువకులు చనిపోతున్నారు, వందలాది వంది వితంతువులు అవుతున్నారు. మద్యాన్ని నియంత్రించాల్సినప్పటికీ, ఏ రకంగా ఈ మద్యం ప్రజలను బానిసలుగా చేస్తున్నదో, ప్రజల రక్తాన్ని మనం ఏరకంగా తాగుతున్నామనే విషయాన్ని ఆలోచించాల్సి ఉంది. యువశక్తిని నిర్వీర్యం చేసేటువంటి..

**శ్రీ ఈటల రాజేందర్(ఆర్థిక శాఖ మంత్రి): –** అధ్యక్షా, 19,000 కోట్ల రూపాయలు మద్యం ద్వారా ఆదాయం వస్తుందని, ఏ లెక్కలు చెప్పాయి, ఏ పుస్తకాలు చెప్పాయి, ఆ లెక్కలు ఎవరిచ్చారనే విషయాన్ని చెప్పగల్గుతారా. విలువ ఆధారిత పన్ను 36,000 కోట్ల రూపాయలని మీరే చెబుతున్నారు. ఆ ముప్పై ఆరువేల కోట్లల్లో కేవలం మద్యం ద్వారానే 19,000 కోట్ల రూపాయలు వస్తున్నాయని ఎవరన్నారు, ఏ లెక్కలు చెబుతాన్నాయో చెప్పగల్గుతారా.

12.20 మ. **శ్రీ జి. కిషన్ రెడ్డి :–** అధ్యక్షా, ఈ సంవత్సర ప్రొజెక్షన్ గురించి నేను చెప్తున్నాను. వర్తమాన ఆర్థిక సంవత్సరం అంటే 2017-18 ప్రొజెక్షన్స్‌లో చూపించిన విధంగా మద్యం బార్లు మరియు వైన్ షాపుల మీద 9వేల కోట్ల రూపాయలు, మద్యం పన్నుల రూపంలో 10వేల కోట్ల రూపాయలు, మొత్తం 19వేల కోట్ల రూపాయలు వసూలు అవుతుంది. కావాలంటే ప్రొజెక్షన్ తీసుకుని చూడండి.

**శ్రీ ఈటల రాజేందర్ :–** అధ్యక్షా, అలాంటిది ఎక్కడా చెప్పలేదు. ప్రొజెక్షన్‌లో అవన్నీ ఉన్నాయా?

**శ్రీ జి. కిషన్ రెడ్డి :–** అధ్యక్షా, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తామని అన్నారు. అది బాకీల తెలంగాణగా మారిపోయింది. రెండున్నర సంవత్సరాలుగా 2016-17 రాష్ట్ర బడ్జెట్ సవరణల ప్రకారం రూ.1,14,000 కోట్ల అప్పులు ఉన్నట్టు గత సంవత్సర బడ్జెట్‌లో చెప్పారు. 2017-18 రాష్ట్ర బడ్జెట్ లెక్కల ప్రకారం రూ.1,14,000 కోట్లు ఉన్న అప్పు రూ.1,40,000కోట్లకు చేరనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.61,710కోట్లు అప్పు ఉండేది. టి.ఆర్.ఎస్. ప్రభుత్వం వచ్చిన తరువాత 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.83,845కోట్లకు పెరిగిపోయింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.93,115కోట్లకు పెరిగిపోయింది. 2016-17 ఆర్థిక సంవత్సర లెక్కల ప్రకారం రూ.1,14,813కోట్లకు పెరిగిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017-18లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.1,40,523 కోట్లకు పెరగనుందనే విషయం ప్రొజెక్షన్‌లో చూపారు. ఈ రెండున్నరేళ్లలో సుమారు రూ.78వేల కోట్ల అప్పులను చేయడానికి అగ్రిమెంట్లు చేస్తున్నట్లు ప్రొజెక్షన్‌లో చూపారు. అంటే 3,50,00,000 మంది జనాభాలో ఒక వ్యక్తికి సగటున లెక్కపెడితే రూ.42,857 చొప్పున ఒక వ్యక్తి మీద ప్రభుత్వం అప్పు చేసిందనే విషయాన్ని మనవి చేస్తున్నాను.

చేస్తున్న అప్పులకు ప్రతి సంవత్సరం రూ.11,138కోట్లు వడ్డీల రూపంలో ప్రభుత్వం వెచ్చించనుంది. వడ్డీతోబాటు అసలు మొత్తాన్ని కూడా చెల్లిస్తూ ఉండాలి. అది సుమారు రూ.4,559కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా ప్రతి సంవత్సరం వడ్డీలు, అసలు మొత్తం కలుపుకుంటే రూ.15,790కోట్లు అప్పుల గురించి బడ్జెట్‌లో చెల్లించాల్సి ఉంటుంది. అంటే 9 నుండి 10 శాతం బడ్జెట్ అప్పుల గురించి కేటాయించుకోవాల్సి ఉంది. మరో 9వేల కోట్ల రూపాయల అప్పును ప్రభుత్వం దాచి పెట్టింది. ఇటీవల కేంద్రం అమలు చేస్తున్న ఉదయ పథకంలో మన రాష్ట్రం చేరింది. అందులో విద్యుత్తు డిస్కంలకు చెల్లించాల్సిన అప్పులన్నీ రాష్ట్ర ఖజానాకు మార్చుకున్నాము. జెన్‌కో, ట్రాన్స్‌కో వంటి వాటి మీద అప్పులను మనం తీసుకుంటేనే, రాష్ట్రప్రభుత్వాల ఖజానాకు బదిలీ చేసుకుంటేనే ఉదయ పథకంలో చేరడానికి కేంద్ర ప్రభుత్వం కండిషన్ పెట్టింది. రూ.8,924 కోట్ల రూపాయల అప్పు రాష్ట్ర ఖాతాకు చేరింది. ఇది ఏ రకంగా కట్టారు అనే విషయం ఈ బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ డబ్బు ఎక్కడి నుండి వచ్చిందో, ఏ రకంగా ఆ డబ్బును సరిదిద్దబోతున్నారో అనే విషయం లెక్కల్లో ఎక్కడా చూపించలేదు.

వివిధ కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. సుమారు రూ.31,453 కోట్లు వివిధ కార్పొరేషన్ల పేరు మీద ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్లతో అగ్రిమెంట్లు, చర్చలు జరుపుతున్నారు. కొత్తగా ఎన్ని కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు, ఏఏ కార్పొరేషన్ల మీద ఏ రకంగా అప్పులు తీసుకున్నారు, అందుకు సంబంధించిన రెవెన్యూ మోడల్ ఏమిటి, కార్పొరేషన్‌కు బ్యాంకు వాళ్లు అప్పు ఇస్తున్నారంటే ఆ అప్పును ఏ విధంగా తీరుస్తారో చెప్పాలి, ఫైనాన్షియల్ రెవెన్యూ మోడల్ గురించి ప్రజలకు తెలియాల్సి ఉంది. రెండు పడకల గదుల ఇళ్ల గురించి, మిషన్ భగీరథ గురించి అప్పు తెస్తామని అంటున్నారు. ఆ అప్పును ఏ విధంగా తీరుస్తారో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇది తెర వెనుక జరగాల్సిన బాగోతం కాదు. తెలంగాణ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. కాళేశ్వరం సాగు నీటి ప్రాజెక్టు రెవెన్యూ మోడల్ ఏమిటి, ఆ ప్రాజెక్టుకు కూడా అప్పు తెస్తున్నారు. ఆ అప్పును ఏ రకంగా తీరుస్తారు. ప్రభుత్వం తీరుస్తుందా, రైతుల మీద భార మోపుతారా ఏ రకంగా చేస్తారన్నది తెలియాల్సిన అవసరం ఉంది. అనేక రకమైన కార్పొరేషన్ల గురించి తీసుకుంటున్న రూ.50వేల కోట్లకు కనీసం 8శాతం వడ్డీ చొప్పున వేసుకున్నా, సంవత్సరానికి రూ.4వేల కోట్లు వడ్డీ కట్టాలి. ఆ విషయాన్ని కూడా బడ్జెట్‌లో ఎక్కడా చూపించలేదు. అది మీకు లెక్కలో లేదు.

**శ్రీ ఈటల రాజేందర్ :–** అధ్యక్షా, గౌరవనీయులు కిషన్ రెడ్డి గారు చాలా అనుభం ఉన్నటువంటి శాసన సభ్యులు. నిన్న ముఖ్యమంత్రి గారు ఇదే శాసన సభలో చెప్పారు. ఎప్పుడు పడితే అప్పుడే, ఎలా పడితే అలా, ఎంత అంటే అంత లోన్లు ప్రభుత్వం తీసుకునే ఆస్కారం ఉండదు. ఆ విషయం మీకు కూడా తెలుసు. ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టానికి లోబడి మాత్రమే లోన్లు తీసుకుంటాము. తమరికి ఇది కూడా తెలుసు, ఎఫ్.ఆర్.బి.ఎమ్. అనేది మన ఆర్థిక పరిపుష్టిని బట్టి, 3శాతమా లేక 3 ½ శాతమా అనే విషయం కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ వారే చూస్తారు. రెండవది, జి.యస్.డి.పి పెరుగుదలను ఆధారంగా తీసుకునే లోన్లు ఇస్తారు. మనం కేంద్ర ప్రభుత్వ చట్టానికి లోబడి మాత్రమే లోన్లు తీసుకుంటున్నాము అనే విషయాన్ని మర్చిపోకూడదు. కార్పొరేషన్లకు లోన్లు తీసుకోవాలంటే తప్పకుండా ప్రభుత్వ పరమైన గ్యారెంటీ ఉండాలి. మన రాష్ట్రంలో ఉన్న రెవెన్యూ రిసీట్లలో 90శాతం లోబడి మాత్రమే గ్యారెంటీ ఇవ్వాలి తప్ప అంత కంటే ఎక్కువ గ్యారెంటీ ఇచ్చే ఆస్కారం లేదు. బ్యాంకర్లు అప్పు ఇచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక ప్రగతి ఏమిటి, వారి సామర్థ్యం ఏమిటి, ఎంత లోను ఇవ్వవచ్చు అని అంచనా వేసుకుని మాత్రమే లోన్లు ఇస్తారు. గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల ఎఫ్.ఆర్.బి.ఎమ్. ద్వారా తీసుకున్న లోను ఎంత, రెవెన్యూ రిసీట్లు ఎంత అనే లెక్కలు చూస్తే తెలుస్తుంది. తెలంగాణ కొత్త రాష్ట్రమని మీరే చెప్తున్నారు. ప్రజలకు అనేక రకాలైన ఎక్స్‌పెక్టేషన్స్ ఉంటాయి కనుక వాటిని చేరుకోవాలనే ఉద్దేశంతో, అభివృద్ధి కావాలనే ఇవన్నీ చేస్తున్నాము తప్ప అప్పుల ఊబిలో కూరుకుపోయే విధంగా చేస్తున్నామనే భావన తప్పు. అప్పు అనేది ఇరిగేషన్ కోసం, కరెంట్ కోసం, వివిధ కార్యక్రమాల గురించి చేస్తున్నాము, ప్రజల కోసం చేస్తున్నాము. అప్పు అనేది ఏదో తీసుకోకూడనిది, జరగకూడనిది అనే మాట తమరు చెప్పడం బాగుండదని విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ జి. కిషన్ రెడ్డి :–** అధ్యక్షా, నేను చెప్పింది, వారు చెప్పింది ఒకటే. రాష్ట్ర ఆర్థిక లెక్కలను చూసే కేంద్ర ప్రభుత్వం అప్పు ఇస్తుంది కాబట్టి, అప్పుల కోసమే బడ్జెట్ లెక్కలు వేసి ఎందులో ఎంత ఆదాయం వస్తుందనే విషయాన్ని చెప్పి అప్పు తీసుకువస్తారని నేను చెప్తున్నాను. ఆర్థిక మంత్రి గారు కూడా అదే విషయం చెప్పారు.

రెండు గదుల ఇళ్లస్కీము గురించి బడ్జెట్‌లో లేదు. దళితులకు 3ఎకరాల భూమి అని గొప్పగా చెప్పి చాలా తక్కువగా ఇస్తున్నారు. ఉద్యోగాల గురించి ఇంకా అనేక రకాలైన హామీలు మీరు ఇచ్చారు. మీ మేనిఫెస్టో పుస్తకం చదవాలంటే చాలా ఉన్నాయి. అందులోని రెండు మూడు విషయాలను గురించి చెప్తున్నాను. ప్రతి మండలంలో

30 పడకలతో, నలుగురు డాక్టర్లు ఉండి, 24 గంటలు పని చేసే ఆసుపత్రిని కడతామని అన్నారు. ఆ ఆసుపత్రి ఇప్పుడు పూర్తైపోవాలని అడగడం లేదు. ఆ ఆసుపత్రి గురించి ఏ రకంగా అడుగులు ముందుకు వేస్తున్నారు, ఏ రకంగా ప్రతిపాదనలు చేస్తున్నారు, మీ ప్రణాళిక ఏమిటి, అందుకు కావాల్సిన బడ్జెట్ ఏమిటి, మిగిలింది ఒకే సంవత్సరం కాబట్టి, ఒక్క సంవత్సరంలో ఏ రకంగా కట్టబోతున్నారు. అదే విధంగా అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో 100 పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామని అన్నారు. అందుకు గాను మీ దగ్గర యాక్షన్ ప్లాన్ ఏముంది? 3 సంవత్సరాలు పూర్తి అయిపోయింది. ఎక్కడా ఆసుపత్రులు ప్రారంభం కాలేదు. ఎప్పటిలోపు పూర్తి చేస్తారు?

**12.30 మ.** గతంలో 10 జిల్లాలు ఉంటే, మీ మేనిఫెస్టోలో 24 జిల్లాలు అవుతాయని, అందులో నిమ్స్‌లాంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను అన్ని జిల్లా కేంద్రాల్లో పెడతామని అన్నారు. చాలా సంతోషం. కాని 24 జిల్లాలు, ప్రస్తుతం 31 అయ్యాయి. దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ ఏమిటి? బడ్జెట్‌లో వాటికి ప్రొవిజన్స్ ఏమిటి? ప్రస్తుత బడ్జెట్‌లో ఈ విషయాలపై పొందుపరచకపోతే, 2018 బడ్జెట్‌లో అయినా పొందుపరచి, 2019 ఎన్నికల సమయంలోపు వీటిని ఏ విధంగా పూర్తి చేస్తారు? ఈ విషయాలన్నిటినీ అడగవలసిన బాధ్యత మాపై ఉంది. ఈ రోజు ప్రజలకు విద్య, వైద్యం అవసరం. కనుక వైద్యం విషయంలో మీరు ఇచ్చిన హామీలు ఎంత వరకు అమలు చేస్తున్నారో చెప్పాలి. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు వంద కోట్ల రూపాయలు ఇచ్చారన్నారు, ఇచ్చారా, లేదా? ఒకవేళ వీటిని ఇస్తే ఏమి చేశారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు ఏ మాత్రం మెరుగుపడని పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటి వరకు ఆసుపత్రులు ఏ విధంగాను మెరుగుపడలేదు. ఇదే శాసన సభలో వంద కోట్ల రూపాయలు ఇచ్చామన్నారు, ఇచ్చారా లేదా? ఈ విధంగా వైద్య, ఆరోగ్య పరిస్థితులు ఉన్నాయని తెలియజేస్తున్నాను.

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం గురించి మీ మేనిఫెస్టోలో ఉన్న వాటిని చదువుతాను. ముఖ్యమంత్రి గారు శాసనసభలో గృహ నిర్మాణం గురించి చాలాసార్లు తెలిపారు. " గతంలో ఉన్న గృహ నిర్మాణం లోపభూయిష్టంగా ఉంది. వారి ఆత్మగౌరవాన్ని భంగపరచే విధంగా ఉంది. కేవలం ఒక గదిలో భార్య, భర్త, పిల్లలు జీవించాల్సి రావడం ఎంత నరకమో ఊహించవచ్చు. ఆ గదిలోనే కోళ్లు, మేకలను పెంచుకోవలసిన దుస్థితిలో పేదలు జీవిస్తున్నారు. కనీసం మహిళలు స్నానం చేయడానికి, బట్టలు మార్చుకోవడానికి, చిన్న చాటు కూడా లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురౌతున్నారు. ఈ దుస్థితి నుంచి పేద ప్రజలను విముక్తి కల్గించడం కోసం, వారికి గౌరవ ప్రదమైన నివాస యోగ్యమైన ఇళ్లు కట్టించేందుకు టి.ఆర్.ఎస్.పార్టీ కృతనిశ్చయంతో ఉంది." అనే విషయాన్ని మేనిఫెస్టోలో పెట్టారు. గడిచిన మూడు సంవత్సరాల్లో ఎన్ని ఇళ్లు నిర్మించి, ఎంత మందికి ఇచ్చారు? ఒక రాజకీయ పార్టీగా నేను మాట్లాడడం లేదు. ప్రజల గొంతుకనై ఈ శాసన సభలో వినిపిస్తున్నాను. ప్రజలకు ప్రభుత్వమంటే ఈ పార్టీ, ఆ పార్టీ అని కాకుండా, ప్రభుత్వమంటే మంత్రి, ప్రభుత్వమంటే ఎమ్.ఎల్.ఏ అధ్యక్షా. ప్రజలు రెండు పడక గదుల సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ఇప్పటి వరకు పూర్తి చేశారు. ముఖ్యమంత్రి గారి, తలసాని శ్రీనివాస యాదవ్‌గారి నియోజకవర్గాల్లో ఇళ్ల తాళాలు ఇస్తే సరిపోదు. ఎన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల తాళాలు ప్రజలకు అందించారు. టెండర్లు రావడం లేదనే విషయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ ప్రభుత్వంపై విశ్వాసం లేక కాంట్రాక్టర్లు టెండర్లు వేయడానికి ముందుకు రావడం లేదా? సాగునీటి ప్రాజెక్టుల కారణంగా, మిషన్ భగీరథ కారణంగా టెండర్లు రావడం లేదని మంత్రి గారు శాసన సభ బడ్జెట్ స్పీచ్‌లో చదివారు. ఈ మాట నమ్మశక్యంగా ఉందా అని అడుగుతున్నాను. కాంట్రాక్టర్లు రాకపోతే వారిని మోటివేట్ చేయండి, తెలంగాణ ప్రాంత కాంట్రాక్టర్లను ఎంకరేజ్ చేసి, యువజన సంఘాలుగా చేసి కాంట్రాక్టులు ఇచ్చి, ఉపాధి కల్పించండి. మీ ప్రభుత్వంపై విశ్వాసం లేనందున డబుల్ బెడ్ రూమ్‌లకు కాంట్రాక్టు రావడం లేదనే విషయాలు అర్థం కావడం లేదు. ప్రజల్లోకి మీరు ఏ ముఖం పెట్టుకుని 2019వ సంవత్సరంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లగలరు. మూడు సంవత్సరాలు పూర్తైనా రెండు కాలనీల్లో ఇళ్లు కట్టాము. నిధులు బయట నుంచి తెస్తారా, ఇంటర్నేషనల్ సంస్థల నుంచి తెస్తారా, లేక ప్రైవేట్ సంస్థ వారు కడతారని ఒక మంత్రి గారంటారు, కాని ఏ ప్రైవేట్ కంపెనీ కట్టదు. ప్రభుత్వం అప్పు తీసుకువచ్చి కట్టాలి తప్ప, సి.ఎస్.ఆర్ క్రింద కడతారని అనుకుంటే ఎలా అని అడుగుతున్నాను. కనుక ఇప్పటికైనా వాస్తవ దృక్పథంతో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల పథకాన్ని అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదనే విషయాన్ని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

మేనిఫెస్టోలో విద్యుత్ సర్ ఛార్జీలను రద్దు చేస్తామని ప్రధాన అంశంగా పెట్టారు. ఉచిత విద్యుత్ అంటున్నారు. కాని సర్ ఛార్జీ కట్టకపోతే, వైర్లను డిస్ కనెక్ట్ చేస్తున్నారు. కొన్ని ప్రదేశాల్లో డిస్ కనెక్టైన వివరాలను అందిస్తాను.

(కొంతమంది టి.ఆర్.ఎస్. సభ్యుల నుంచి అంతరాయం )

ఈ విషయాల గురించి ఆఫీసర్స్‌ని పిలిచి మాట్లాడండి. ఇదే శాసన సభలో ఛాలెంజ్ చేస్తున్నాను. సర్ ఛార్జీ పేరుతో విద్యుత్‌ను డిస్ కనెక్ట్ చేసిన విషయాలను నిరూపిస్తాను. సర్ ఛార్జీ పేరుతో రైతులను వేధించ లేదంటే ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నాను. ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందా.

**శ్రీ నాయిని నర్సింహారెడ్డి (హోం శాఖ మంత్రి):-** విద్యుత్ వచ్చిందా లేదా?

**శ్రీ జి.కిషన్ రెడ్డి:-** దేశంలో నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యుత్‌కి సంబంధించిన విప్లవం వచ్చింది.

**శ్రీ నాయిని నర్సింహారెడ్డి:-** ఇక్కడ నరేంద్రమోడీ ఏమి చేయలేదు.

**శ్రీ జి.కిషన్ రెడ్డి:-** అన్ని రాష్ట్రాల్లో కూడా మిగులు విద్యుత్ ఉంది. ప్రస్తుతం దేశంలో మిగులు విద్యుత్ ఉంది. గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు యూనిట్‌ని రూ.14 నుంచి రూ.16కి కొన్నాము. కాని ఈ రోజు ఓపెన్ గ్రిడ్‌లో రూ.2.14పైసలకు, ఎంత కరెంటు కావాలన్నా దొరుకుతున్నదని తెలియజేస్తున్నాను. దేశంలో విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన విషయంలో నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చింది.

(కొంతమంది టి.ఆర్.ఎస్. సభ్యుల నుంచి అంతరాయం )

కేంద్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి డబ్బు ఇస్తున్నది. మీరు బడ్జెట్‌లో వెయ్యికోట్లు రూపాయలని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్నామని పెట్టారు. అనేక రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇస్తున్న డబ్బు విషయాలను బడ్జెట్‌లో పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న డబ్బును పెట్టారా, లేక మరే డబ్బునైనా ఇందులో పెట్టారా ఆ విషయాలను బడ్జెట్‌లో చూపలేదు.

బడ్జెట్ పుస్తకంలోని కారణాలు గతంలో తెలిపిన విధంగానే ఉన్నాయి. కోర్టు కేసుల కారణంగా వాణిజ్య పన్నులు కలెక్ట్ కాలేదని, భూములు అమ్మలేదని, అదే పదాలు, అవే పుస్తకాలు రాస్తున్నారు. ఎందుకు రాబడి రావడం లేదంటే, గతంలో ఉన్న పుస్తకంలోని కాగితం సంఖ్య మార్చి దానినే మరల చదువుతున్నారు. కొన్ని పదాలైనా మార్చండి. చదవడానికి కొంత అందంగా ఉంటుంది.

**శ్రీ నాయిని నర్సింహారెడ్డి:-** అబద్ధాలైతే మార్చగలము. అబద్ధాలు కావివి.

(టి.ఆర్.ఎస్. సభ్యుల నుంచి అంతరాయం)

**శ్రీ జి.కిషన్‌రెడ్డి:-** మేడమ్ డిప్యూటీ స్పీకర్ తమరికి ఒక కాపి ఇస్తున్నాను. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి హోమ్‌గార్డులు తీసుకుంటున్న జీతం రూ.6000, మా ప్రభుత్వం వచ్చి వారికి రెండు విడుతలుగా జీతాలను రూ.12000 చేసింది" అని వ్రాసారు. కాని మీ ప్రభుత్వం వచ్చినప్పటికి హోంగార్డుల రూ.9000 జీతం ఉంది. బడ్జెట్ పుస్తకంలో ఇచ్చిన ఈ వార్త చిత్తశుద్ధితే రాజీనామా చేస్తాను. మీరు సిద్ధంగా ఉన్నారా అని అడుగుతున్నాను.

(కొంతమంది టి.ఆర్.ఎస్. సభ్యుల నుంచి అంతరాయం)

**శ్రీ నాయిని నర్సింహారెడ్డి:-** తప్పుగా పడి ఉంటుంది.

**శ్రీ జి.కిషన్‌రెడ్డి:-** బడ్జెట్ ఉపన్యాసంలో తప్పు ఉంటుందా? ఆ అధికారిపై చర్య తీసుకోండి. హోంగార్డులు ధర్నా చేసినప్పుడు హోం శాఖమంత్రి, ఆర్థిక శాఖమంత్రి కూడా ధర్నా చేసే ప్రాంతానికి వచ్చారు. కాని మీ ప్రభుత్వం వచ్చినప్పటికి రూ.6000 జీతం అని ఉంటే, నేను రాజీనామా చేస్తాను. అందరం కలిసి ధర్నాలు చేసినందున రూ.9000 ఉన్న జీతాన్ని రూ.12000 పెంచారు. ఇదా ప్రభుత్వ పని తీరు. బడ్జెట్ ఉపన్యాసాన్ని ఆర్థిక శాఖ మంత్రి చదువుతున్నప్పుడు ఇంత పెద్ద తప్పిదాలు ఉంటే ఎలా? ఏ విధంగా మీరు ప్రిపేరౌతున్నారు? మీ ప్రభుత్వం వచ్చినప్పుడు నేను ధర్నాలు చేసినందున జీతాలు పెంచడానికి హోంమంత్రి గారు సహకారాన్ని అందించి ఒకసారి జీతాలను పెంచి, రెండుసార్లు పెంచారని బడ్జెట్ ఉపన్యాసంలో తప్పులు వ్రాస్తారు.

**12.40 మ.**

ఈ రాష్ట్రంలో అనేక డిపార్టుమెంట్లలో కాంట్రాక్టు ఉద్యోగస్తులు ఉన్నారు. వారిని రెగ్యులరైజ్ చేసే విషయంలో ఈ ప్రభుత్వానికి ఒక విధానం ఉందా లేదా? కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేస్తామని మీరు మేనిఫెస్టోలో చెప్పడం జరిగింది. ఈ రాష్ట్రంలో ఏ ఏ శాఖలో ఎంత మంది కాంట్రాక్టు ఉద్యోగస్తులు ఉన్నారో ఆర్థిక శాఖకు వివరాలు ఇచ్చారా? దీనికి సంబంధించి ప్రభుత్వం శ్వేత పత్రాన్ని ఏమైన విడుదల చేస్తుందా? ఏ రకంగా వాళ్లను రెగ్యులర్ చేయబోతున్నారు. కనీసం జీతాలన్నా పెంచారా? ఈ ప్రభుత్వ వ్యవస్థలో మినిమమ్ వేజేస్ యాక్ట్ అమలవుతుందా? మంత్రిగారు నాలుగైదు శాఖల పేర్లు చెప్పి మినిమమ్ వేజేస్ కంటే ఎక్కువ వేజేస్ ఇస్తున్నామని ఉపన్యాసంలో చెప్పారు. చాలా సంతోషం. ఎందుకంటే, మన ఉద్యోగస్తులు, మన తెలంగాణ బిడ్డలు తెలంగాణ రాష్ట్రసాధనలో కీలకపాత్ర పోషించారు. అనేక మంది కాంట్రాక్టు ఉద్యోగస్తులు అనేక శాఖల్లో ఉన్నారు. ఎందుకు వారిని రెగ్యూలరైజ్ చేయడం లేదు. ఇదే

శాసనసభలో ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ, సింగరేణి కాలరీస్‌లో కాంట్రాక్టు ఉద్యోగస్తులే లేరన్నారు. సింగరేణి కాలరీస్‌లో 20వేల మంది కాంట్రాక్టు ఉద్యోగస్తులు ఉన్నారు. గతంలో సింగరేణి కాలరీస్‌లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేశారు. 1990లో రెగ్యులరైజ్ చేసినట్లుగా జి.ఓ కూడ ఉన్నది. నేను గతంలో ఇచ్చినటువంటి జి.ఓ. తీసుకు వచ్చి చూపిస్తాను. మీరు ఎవరైన ఛాలెంజ్ చేసి నిలబడుతారా, నిలబడండి. నాకు గంట సమయం ఇస్తే ఇప్పుడే తీసుకు వచ్చి చూపిస్తాను.

ప్రభుత్వ ఉద్యోగస్తులకు 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినందుకు చాలా సంతోషం. ఇంత వరకు ఆ ఫిట్‌మెంట్ బకాయిలు ఉద్యోగస్తులకు ఇవ్వలేదు. ఇంత వరకు రెండు డి.ఏలు ఇవ్వలేదు. ఆ విషయంలో ప్రభుత్వం ఒకసారి ఆలోచన చేయాలి.

ఫీజు రీఇంబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం రీఇంబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వలన కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు హాల్‌టికెట్లు ఇవ్వనందున విద్యార్థులు, తల్లిదండ్రులు చాలా ఆందోళన పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీఇంబర్స్‌మెంట్ రానీ కారణంగా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు నరకం చూపిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి ఎం.ఎల్.ఏలను బ్రతిమిలాడుకుంటే మనం పోయి హాల్ టికెట్లను ఇప్పించడం జరుగుతోంది. ఆ పరిస్థితి ఎందుకు రావాలి. ముఖ్యమంత్రిగారు బకాయిలు లేకుండా చేస్తామని ఇదే శాసనసభలో చాలా సార్లు చెప్పారు. నెల నెలా ఇస్తామని చెప్పారు. కానీ, ఇంత వరకు పూర్తి బకాయిలు చెల్లించలేదు. ఈ ఫీజు రీఇంబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా మార్చవలసినటువంటి అవసరం ఉన్నది.

గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రైతులకు ఎంత బడ్జెట్ కేటాయించారో ఈ ప్రభుత్వాన్ని చెప్పవలసినదిగా కోరుతున్నాను. 2016-2017లో మొత్తం బడ్జెట్ లక్షా పన్నెండు కోట్లు, ఈ సంవత్సరం లక్షా నలభై ఎనిమిది వేల కోట్లకు పెరిగింది. వ్యవసాయానికి గత సంవత్సరం ఆరు వేల ఏడు వందల యాభై తొమ్మిది కోట్లు కేటాయించారు. ఈ సంవత్సరం అయిదు వేల నాలుగు వందల ముప్పై తొమ్మిది కోట్లు కేటాయించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్ తగ్గింది. మొత్తం బడ్జెట్ పెరుగుతున్నప్పుడు వ్యవసాయ బడ్జెట్ పెరగాలి కదా? ఎందుకు తగ్గింది? ఇది రైతుల వ్యతిరేక బడ్జెటా, రైతుల అనుకూల బడ్జెటా చెప్పవల్సిందిగా కోరుతున్నాను. బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి కేటాయింపులు తగ్గించడం వలన వ్యవసాయరంగం కుదేలవుతుంది.

ఈ సంవత్సరం ఇంకా చాలా చేస్తామని చెప్పారు. బీమా పథకంలో రైతులందరిని చేరుస్తామని చెప్పారు. ప్రీమియం చెల్లించలేదు. ఆల్ ఇండియాకు సంబంధించినటువంటి డైట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే ప్రకారం ఈ రోజు మన తెలంగాణలో 74శాతం మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నారు. వడ్డీలేని ఋణాల వలన రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోజు ప్రభుత్వం విత్తనాలు, స్ప్రింక్లర్స్, పాలీహౌస్ కల్టివేషన్స్ వంటివి రైతులకు సబ్సిడీ మీద అందచేస్తుందని చెప్పారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ట్రాక్టర్లు ఇస్తున్నందున ఒక మండలానికి సంబంధించి వారి పేర్లు వివరాలను ఆర్.టి.ఏ సమాచారం ద్వారా తీసుకున్నాను. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పచ్చ చొక్కాలకు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వాళ్ల పార్టీ కార్యకర్తలకు, ప్రస్తుతం టి.ఆర్.ఎస్ ప్రభుత్వం పింక్ చొక్కాలకు ప్రభుత్వ పథకాల లబ్దిని చేకూరుస్తున్నది. దీనికి సంబంధించి డాక్యుమెంటరీ ప్రూఫ్‌ను మీకు అందజేస్తాను.

(సంబంధిత సమాచారాన్ని అధ్యక్ష స్థానంలో ఉన్న డెప్యూటి స్పీకర్‌గారికి అందచేయడం జరిగింది)

ఒక మండలంలో 9 ట్రాక్టర్లు ఇస్తే, 9 ట్రాక్టర్లు కూడా టి.ఆర్.ఎస్. కార్యకర్తలకు ఇచ్చినట్లు ఈ పత్రాల ద్వారా తెలుస్తున్నది. గడ్డం చంద్రన్న అనే ఒక వ్యక్తి ఎమ్.పి.టి.సి, ఆయన టి.డి.పి. నుంచి టి.ఆర్.ఎస్.కు వచ్చినందుకు ట్రాక్టర్ ఇచ్చారు. ఒక వ్యక్తి కాంగ్రెస్ నుంచి టి.ఆర్.ఎస్.కి వచ్చినందుకు ఆయనకు ఒక ట్రాక్టర్ ఇచ్చారు. మూడవ ట్రాక్టర్ టి.ఆర్.ఎస్ మండల అధ్యక్షునికి ఇచ్చారు. సామేలు అంజయ్య ఎం.పి.టి.సి, ఆయన ఇంతకు ముందు ఎస్సీ కార్పొరేషన్ నుంచి లోన్లు కూడా పొందాడు. ఆయన ఎం.ఎల్.ఏ సన్నిహితుడు కాబట్టి ఆయనకు కూడా ట్రాక్టర్ ఇచ్చారు.

ఇంతకు ముందు ప్రశ్నోత్తరాల సమయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌గారు గొర్రెల గురించి చాలా బాగా మాట్లాడారు. గొర్రెల పెంపకం చాలా మంచి పథకము. ఇది స్వాగతం పలుకవలసినటువంటి కార్యక్రమం. నేను నిన్న కేంద్రమంత్రి గారితో మాట్లాడాను. జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ ఋణాలు, గ్రాంట్లు రూపంలో సుమారు రూ.4వేల కోట్లు ఈ రాష్ట్రానికి ఇవ్వబోతున్నది. ఇది సెంట్రల్ గవర్నమెంట్ స్కీమ్. మీరు నిన్న, మొన్న గొర్రెలు పట్టుకున్నారు, గొంగళ్లు కప్పుకున్నారు. కనీసం, ఒక్కసారైనా నరేంద్రమోడీగారి పేరు మీరు మాట్లాడలేదు. ఢిల్లీకి ముఖ్యమంత్రిగారు వెళ్లినప్పుడు నరేంద్రమోడీగారికి ఒక గొర్రెను, ఒక గొంగళిని ఇచ్చి ఉంటే న్యాయంగా ఉండేది.

**శ్రీ ఈటెల రాజేందర్ః-** తెలంగాణ ప్రభుత్వానికి ఎంత నిజాయితీ ఉందో నేను మళ్లీ మళ్లీ చెప్పాల్సిన అక్కర్లేదు. ఇళ్లస్కీమ్‌లో కేంద్రప్రభుత్వం ఇచ్చిన వాటా ఎంత? ఎన్.సి.డి.సి ఋణాల్లో కేంద్రప్రభుత్వం ఇచ్చిన సబ్సిడి ఎంత? తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం ఏ విధంగా సహకరిస్తుంది వంటి విషయాలపై ఇదే సభలో గౌరవ ముఖ్యమంత్రిగారు అనేకసార్లు చెప్పారు. మళ్లీ చెప్పమంటే చెబుతాము.

12.50 మ. కిషన్ రెడ్డి గారు, 4వేల కోట్ల రూపాయల ఋణము అడిగాము. అందులో కేంద్ర ప్రభుత్వానికి 20 శాతం సబ్సిడీ ఇచ్చే ఆస్కారము ఉంటుంది. ఆ 20 శాతము కూడా ఎన్ని వేల కోట్ల రూపాయలకు ఇస్తుందో ఇప్పటి వరకూ ఎలాంటి ఇండికేషన్ లేదు. గతంలో ఇచ్చిన రూ.400 కోట్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ కేవలం 20 శాతం మాత్రమే. యాదవులకు కేంద్ర ప్రభుత్వం తరఫున 20 శాతం సబ్సిడీతో పాటు, తెలంగాణ రాష్ట్రప్రభుత్వం వడ్డీ రూపంలో ఒక 20 శాతం సబ్సిడీ ఇస్తోంది. కిషన్ రెడ్డి గారికే ఉదార స్వభావం ఉంటే, మీ పార్టీ గొప్ప హృదయంతో మా యాదవులను ఆదుకుంటానంటే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అనౌన్స్ చేసినందున, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 20 శాతం సబ్సిడీని 50 శాతంగా ఇచ్చే విధంగా ప్రయత్నం చేయండి. తప్పకుండా మోదీ గారికి గొంగళిని బహుకరిస్తాము. గొర్రెను బహుకరిస్తాము. మిమ్మల్ని ఊరేగించే ప్రయత్నం చేస్తాము. మాకు ఎలాంటి పట్టింపులు లేవు.

అయ్యా కిషన్ రెడ్డి గారు మీ ప్రధాన మంత్రి గారిని, మీ ప్రభుత్వాన్ని మీ ముఖ్యమంత్రి గారు కూడా అభినందించక పోవచ్చు. మా ముఖ్యమంత్రి గారు అభినందించారు. జి.ఎస్.టి. కౌన్సిల్ మీటింగ్ కోసం నేను నెలకొక మూడు సార్లు ఢిల్లీకి వెళతాను. తెలంగాణ రాష్ట్రం క్రొత్త రాష్ట్రము. విభజన సందర్భంగా అనేక హామీలు ఇచ్చారు. రాష్ట్రంలో అమలౌతున్న వాటర్ గ్రిడ్, మరియు మిషన్ కాకతీయ కార్యక్రమాలు ఈ దేశంలోనే చాలా గొప్పగా ముందుకు వెళుతున్నాయి. దయచేసి మీరు మాకు కొంచెం సహాయం చేయమని అడిగితే, నీతి ఆయోగ్ తెలంగాణ రాష్ట్రానికి వచ్చి స్టడీ చేసి "ఇదొక గొప్ప స్కీము, దేశానికే ఆదర్శమని" చెప్పి 19వేల కోట్ల రూపాయలకు రికమండ్ చేస్తే, 19 కోట్ల రూపాయలు కూడా రాలేదు. మా కిషన్ రెడ్డి గారు కనీసం 5వేల కోట్ల రూపాయలైనా ఇప్పిస్తారని ఆశిస్తున్నాను. మాకు 10,400 కోట్ల రూపాయల సి.ఎస్.టి. కంపెన్సేషన్ రావాలి. జీతాలు పెంచే విషయంలో, జీతాలు మేము పెంచకపోతే ఎవరు పెంచారు అధ్యక్షా. అంగన్ వాడీ కార్యకర్తలకు రూ.6,200 ఉండే జీతాన్ని రూ.9,000 ఎవరు చేశారు. అందరికీ జీతాలు పెంచింది మేమే కదా. మంచి పని చేస్తే అభినందించే ప్రయత్నం చేయండి. తప్పు జరిగితే ప్రతిపక్షంగా మీరు నిలదీశే ప్రయత్నం చేయండి. అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఒక పార్టీ అప్పులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించడం న్యాయమా? కేంద్ర ప్రభుత్వం కూడా ఎంత శాతం అప్పు తీసుకుందో ఒకసారి చూడండి. ఫిస్కల్ డెఫిసిట్ 3.21 కేంద్ర ప్రభుత్వం కూడా వ్రాసుకుంది. అదే పద్ధతిలో రాష్ట్రప్రభుత్వం కూడా ఉంటుంది. అప్పు చేయని రాష్ట్రాలు, ఫిస్కల్ డెఫిసిట్ లేని రాష్ట్రాలు ఉండవు. అప్పులు చేయకుండా అభివృద్ధి ముందుకు పోదు. ఒకవేళ అప్పు చేయకపోతే నువ్వు అభివృద్ధిని కాంక్షించడం లేదని అర్థము. తెలంగాణ రాష్ట్రము క్రొత్త రాష్ట్రము, అనేక కార్యక్రమాలు మన కళ్ల ముందు ఉన్నాయి కాబట్టి, దీన్ని గొప్ప రాష్ట్రంగా తీసుకు వెళ్లాల్సిన అవసరము ఉంది. ఆ విధంగా చేస్తాము. మహరాష్ట్రప్రభుత్వానికి రూ.1,88,520 కోట్ల అప్పు ఉంది. మీరు ఒకసారి కన్‌ఫార్మ్ చేసుకోండి. ఇన్ని సంవత్సరాలు మీ ఆదాయం ఎంత? మీ బడ్జెట్ ఎంత అనేది లెక్క చేసుకోండి తప్ప ఇతరుల మీద బురద చల్లే ప్రయత్నం తమరికి తగదు అని మాత్రమే చెప్పదలుచుకున్నాను. మీరు కేవలం విమర్శ కోసం విమర్శ చేయకండి. దయచేసి ఏమైనా తప్పులు జరిగితే సవరించే ప్రయత్నం చేయండి. మంచి సూచనలు, సలహాలు ఇచ్చే ప్రయత్నం చేయండి. అందరము కలిసి తెలంగాణను తెచ్చుకున్నాము. ఈ రాష్ట్రప్రభుత్వం కేవలం మా పార్టీ అని కాకుండా అందరం కలిసి తెలంగాణను అభివృద్ధి చేసుకుందామనే గొప్ప మాట చెప్పింది మా ముఖ్యమంత్రి గారే కాబట్టి తెలంగాణ రాష్ట్రఎదుగుదలకు మంచి సలహాలు ఇవ్వండి. అంతే కానీ ఈ రాష్ట్రము అప్పుల ఊబిలో కూరుకుపోతోందనే నైరాశ్యముతో మాత్రము మాట్లాడకండి. తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని తెలంగాణ ధైర్యాన్ని కాని దెబ్బ తీసే విధంగా దయచేసి మాట్లాడొద్దని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ జి. కిషన్ రెడ్డిః-** విశ్వవిద్యాలయాల విషయానికి వస్తే, కే.జీ. టు పీ.జీ. అన్నారు. గురుకులాలతోటి కే.జీ., పీ.జీ. చూపిస్తున్నారు. ఇక్కడ కే.జీ. లేదు., అక్కడ పీ.జీ. లేదు. మధ్యలో గురుకులాలను చూపిస్తున్నారు. కే.జీ. పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. దయనీయ పరిస్థితుల్లో ఉంది. దానికి ఏ విధంగా చేయబోతున్నారని ఇప్పటి వరకు కార్యాచరణ లేదు. పి.జి. పరిస్థితి కూడా చాలా దారుణంగా ఉంది. నేను ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. విశ్వవిద్యాలయాల పని తీరు చాలా దయనీయంగా ఉంది. యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది లేక, నిధులు లేక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో 2,753

అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు మంజూరైతే ఇప్పుడు 1,249 మంది మాత్రమే ఉన్నాయి. ఇంకా 1,504 పోస్టులు ఖాళీగా ఉన్నాయి, అంటే 55 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.

కాంట్రాక్టు ఉద్యోగులను భోదనా సిబ్బంది మరియు భోదనేతర సిబ్బందిగా నియమించి కాలం వెళ్లబుచ్చుతున్నారు. మంత్రి గారు వినండి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 42 డిపార్ట్‌మెంట్లలో ప్రొఫెసర్లు లేరు. ప్రొఫెసర్లను రిక్రూట్‌మెంట్ చేయడానికి మూడు సంవత్సరాల సమయం పట్టదు కదా అని అడుగుతున్నాను. అది కేవలం మీ పాపమే అనడం లేదు. అందులో వేరే వారి పాపం కూడా కొంత ఉంది. మన తెలంగాణ ఉద్యమాలకు పురిటి గడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయం. అలాంటి విద్యాలయంలో రోజూ ఉదయం 7 గంటలకు అక్కడకు వెళ్లి చూడండి, కొన్ని వందల మంది పిల్లలు చెంబులు పట్టుకొని చెట్లల్లోకి వెళ్లేటువంటి దౌర్భాగ్యమైన పరిస్థితి కనిపిస్తుంది. ఆ విషయం మంత్రి గారికి కూడా తెలుసు. స్నానాలు బయట చేయాల్సిన పరిస్థితి. డ్రైనేజ్ సిస్టమ్ బాగోలేదు. హాస్టల్స్ కూలిపోతున్నాయి. కూలిపోతున్న 3 హాస్టల్స్‌కు ఇప్పటికే తాళం వేశాము. కూలిపోతున్న హాస్టల్స్‌ను కట్టడానికి, టాయిలెట్స్ నిర్మించడానికి, ప్రొఫెసర్స్‌ను రిక్రూట్ చేసుకోవడానికి మూడు సంవత్సరాలు పట్టదు కదా. ఫ్రెంచి, జర్మనీ, రష్యా, తమిళ్, బాటనీ, హోం సైన్స్ ఇలా అనేక డిపార్ట్‌మెంట్లు క్లోజ్ అయిపోయాయి. దీనికి టి.ఆర్.ఎస్. ప్రభుత్వమే కారణము అనడం లేదు. మూడు సంవత్సరాల్లో వీటన్నింటిని పునరుద్ధరించుకునే అవకాశం ఉండీ కూడా మనం ఎందుకు చేయలేదని అడుగుతున్నాను.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మొత్తం 56 డిపార్ట్‌మెంట్‌లు ఉంటే అందులో 42 డిపార్ట్‌మెంట్లలో ప్రొఫెసర్లు లేరు. 27 డిపార్ట్‌మెంట్లలో ఒక్క అసోసియేట్ ప్రొఫెసరూ లేరు, జీరో. 13 డిపార్ట్‌మెంట్లకు మాత్రం ఒక్కడే ప్రొఫెసర్ ఉన్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం యొక్క శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము. సున్నం వేయడమో, సిరీస్ బల్బులు పెట్టడమో శతాబ్ది ఉత్సవాలు కాదు. రంగులకు, టాయిలెట్లు కట్టించుకోవడానికి, కూలిపోతున్న హాస్టల్ భవనాలను తిరిగి నిర్మించడానికి కేవలం రెండు వందల కోట్లు ఏ మాత్రమూ సరిపోవు. మౌలిక సదుపాయాలను కల్పించండి. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసి, ఖాళీలను భర్తీ చేయండి. హాస్టల్స్, టాయిలెట్స్ కట్టించండి. అటు కేంద్రంలో స్వచ్ఛ భారత్ అని, ఇటు మనము స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ హైదరాబాద్ అంటున్నాము. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మాత్రం టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతుంటే స్వచ్ఛ హైదరాబాద్, స్వచ్ఛ తెలంగాణ ఎక్కడ నుంచి వస్తుంది. అర్థం చేసుకోవాలి. టాయిలెట్లు కట్టించలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో మనం ఉన్నామా?

**మేడమ్ డిప్యూటీ స్పీకర్:–** కిషన్ రెడ్డి గారు చాలా సమయం తీసుకున్నారు. ప్లీజ్ ముగించండి. పద్దుల మీద మాట్లాడేటప్పుడు సమయం తీసుకోండి. మిగతా సభ్యులు కూడా ఉన్నారు మాట్లాడ్డానికి. ముగించండి.

**శ్రీ జి. కిషన్ రెడ్డి:–** ప్రజలు అనుకుంటున్న విషయాలు మాట్లాడుతున్నాను. నేను ప్రజల గొంతుకై మాట్లాడుతున్నాను వినండి. ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను. రాబోయే రోజుల్లో ఈ తప్పులను సరి దిద్దుకోమని చెబుతున్నాను తప్ప, ప్రభుత్వాన్ని విమర్శించడం లేదు, వీటన్నింటిని సానుకూలంగా తీసుకోండి. ప్రభుత్వానికి చాలా మంచి విషయాలు చెబుతున్నాను. నేను ఒక్క ఆరోపణ కూడా చేయడం లేదు.

**1.00 ప.** గత సమావేశం బడ్జెట్ కంటే ఈ సంవత్సరం బడ్జెట్ పెంచారు. హెల్త్ విషయంలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.9కోట్లు మాత్రమే పెంచారు. హెల్త్‌కు ఎంత ప్రియారిటీ ఇవ్వాలి? ప్రభుత్వం ఆలోచన చేయాలి. మండల స్థాయిలో 30 పడకల ఆసుపత్రి, నియోజక వర్గ కేంద్రాలలో 100 పడకల ఆసుపత్రి, జిల్లా కేంద్రాలలో నిమ్స్ లాంటివి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు మొదలైన వాటిని ఏర్పాటు చేయాలంటే రూ.9కోట్లు పెంచితే ఎలా అవన్నీ కడతారు. మీకు సమయం లేదు. నేను హెచ్చరిస్తున్నాను.

విద్య విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది, పొరపాట్లుచేస్తోంది. సరిదిద్దుకోవాలని చెబుతున్నాను. అనేక రాష్ట్రాల కంటే విద్య మీద ఖర్చు చాలా తక్కువ ఖర్చు పెడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యకు 8.81 శాతం నిధులు ఖర్చు పెడుతున్నారు. అన్ని రాష్ట్రాలలో 15, 16, 18 శాతం నిధులు ఖర్చు పెడుతున్నారు. హెల్త్ విషయంలో 3.2 శాతం ఖర్చు పెడుతున్నాము. కేటాయింపులను పెంచవలసిన అవసరం ఉంది. అనేక రాష్ట్రాలు హెల్త్, ఎడ్యుకేషన్, మౌలిక వసతులలో కేటాయింపులు ఎక్కువగా చేస్తున్నాయి. పేద ప్రజలకు కావలసినటువంటి విద్య , వైద్య రంగాలలో తెలంగాణ రాష్ట్రంలో కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయి. మిగతా రాష్ట్రాలతో పోల్చి చూసుకోండి, అప్పులు పోల్చుకోవడం కాదు. అప్పుల విషయంలో ఈ ప్రభుత్వం చంకలు కొడుతోంది. హెల్త్ విషయంలో, విద్య విషయంలో వేరే రాష్ట్రాలు ఎంత కేటాయిస్తున్నారనేది చూసుకోవాలని కోరుతున్నాను.

**మేడమ్ డిప్యూటీ స్పీకర్‌:–** కంక్లూడ్ చేయండి.

**శ్రీ జి. కిషన్ రెడ్డి:–** పాలక పక్ష సభ్యులు ముఖ్యమంత్రిగారిని పొగడడం తప్ప వాస్తవాలు చెప్పరు. నన్ను అయినా చెప్పనివ్వండి. నేను చెప్పే వాస్తవాలు ముఖ్యమంత్రిగారికి, ఆర్థిక మంత్రిగారికి తెలిస్తే కొంత మార్పులు వస్తాయని నేను చెబుతున్నాను. ప్రజలకు మేలు జరుగుతుందని నేను భావిస్తున్నాను.

ఇరిగేషన్‌కు సంబంధించి చాలా ప్రతిష్టాత్మకంగా కేటాయించారు. బడ్జెట్‌లో సింహభాగం ఇరిగేషన్‌కు ఇస్తున్నాము. అది ఏ రకంగా పని చేస్తుందో డాక్యుమెంట్స్ అన్నీ మీకు పంపిస్తున్నాను. ఏ పొరపాట్లు జరగవద్దు, ఎవరినీ ఉపేక్షించనని ముఖ్యమంత్రిగారు అన్నారు.

(ఈదశలో మేడమ్ డిప్యూటీ స్పీకర్‌గారికి డాక్యుమెంట్స్ పంపడం జరిగింది.)

అర్హత లేని కంపెనీలకు టెండర్స్ ఇస్తున్నారు. ఎవాల్యుయేషన్ డాక్యుమెంట్స్ మీ దగ్గర పెట్టాలని కోరుతున్నాను. పాలమూరు, రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల పథకంలోని తెలంగాణ ఇంజనీర్స్ ఇచ్చిన ఎస్టిమేట్స్‌ను కాదని చెప్పి చాలా పెద్దయెత్తున ఇరిగేషన్‌లో చాలా అవకతవకలు చేస్తున్నారు. దీని మీద సమగ్రమైన దర్యాప్తు జరపవలసిన అవసరం ఉంది.

గతంలో బిల్ మానిటరింగ్ సిస్టమ్ ఉండేది. ఇప్పుడు ఆ సిస్టమ్ ఆంధ్రలో ఉంది. ఆ విషయం మంత్రిగారికి కూడా తెలుసు. దానివల్ల ఎవరైనా, ఏ కాంట్రాక్టర్ అయినా కంప్యూటర్‌లో చూడవచ్చు. తెలంగాణలో ఇప్పుడు ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తే అతను మాత్రమే చూడడానికి అవకాశం ఉంది, వేరే కాంట్రాక్టర్స్ చూడడానికి అవకాశం లేదు. గతంలో ఏ కాంట్రాక్టర్‌కు ఏ నెలలో ఎంత బిల్ ఇచ్చారో అందరికీ తెలిసేది, ఇప్పుడు అది లేదు. బిల్ పేమెంట్ ఎప్పుడు వస్తుందో తెలియదు. బిల్ పేమెంట్‌లో పొరపాట్లు జరుగుతున్నాయి. పాలమూరు ఎత్తి పోతల పథకానికి ఐదు లిఫ్ట్‌ల కోసం రూ.35,200 కోట్లకు ఎస్టిమేషన్ వేశారు. అర్హత లేని కంపెనీలకు టెండర్స్ ఇచ్చారు. పాలమూరు ఎత్తి పోతల పథకం పెద్దయెత్తున దుర్వినియోగం జరుగుతుందని పత్రికలలో వస్తోంది. ప్రభుత్వం దానిగురించి ఆత్మపరిశీలన చేసుకోవాలి. సమగ్ర దర్యాప్తు చేయాలి. వాస్తవ విషయాలు ప్రజలకు తెలపాలి. పది లక్షల ఎకరాలకు రూ.35,200కోట్లతో ఐదు లిఫ్ట్‌కు టెండర్స్ వేసి నాలుగు లిఫ్ట్స్ కోసం పూర్తిగా .........

**మేడమ్ డిప్యూటి స్పీకర్‌:–** ఇప్పటికే చాలా సమయం ఇచ్చాను. కంక్లూడ్ చేయండి. డిమాండ్స్‌లో మాట్లాడండి.

**శ్రీ జి. కిషన్‌రెడ్డి:–**నేను డాక్యుమెంట్స్ మీకు ఇచ్చాను. వాటి గురించి చెప్పకుంటే ఎలా? రాష్ట్రం గురించి మాట్లాడుతున్నాను. కెనాల్స్, టన్నెల్స్, రిజర్వాయర్స్ విషయంలో నాలుగు లిఫ్ట్స్ కోసం రూ.29,333 కోట్లకు ఈ ప్రభుత్వం టెండర్స్ పిలిచింది. ఇప్పుడు ప్రాజెక్ట్ పూర్తి కావాలంటే మరొక రూ.25వేల కోట్లు కావాలి. దానిలో మెయిన్ లింక్‌తో అనుసంధానం చేయాలి. ఆ ప్రాజెక్ట్ పూర్తి చేయాలంటే సబ్‌కెనాల్స్ నిర్మాణం పూర్తి చేయాలంటే ఇంకో లిఫ్ట్ పెట్టాలి. దానికి రూ.25 వేల కోట్లు కావాలి. ఇందులో అర్హత లేని కంపెనీలకు టెండర్స్ ఇచ్చారు. మంత్రిగారిని అడుగుతున్నాను, టెండర్ ఎవాల్యుయేషన్ డాక్యుమెంట్స్ స్పీకర్ దగ్గర పెట్టండి. ప్రభుత్వం ఈ విషయంలో ముందుకు రావాలి. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వస్తున్న ఆరోపణలు తప్పు అని ప్రజలకు తెలియచేసే విధంగా టెండర్ డాక్యుమెంట్స్ అన్నీ బయట పెట్టాలి. ఏరకంగా మేనేజ్ చేసి అర్హత లేని కంపెనీలకు ఇచ్చారనేది అందరికీ తెలియాలి. టెండర్స్‌లోని రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ మార్చి టెండర్స్ ఎలా వేశారు? ఆ డాక్యుమెంట్స్ స్పీకర్ దగ్గర పెట్టండి. అది వాస్తవం కాకపోతే ఈ ఆరోపణలు నిజం కాదని ప్రజలకు చెబితే బాగుంటుంది. దీని గురించి కోర్టుకు కూడా వెళ్లారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత మీ మీద ఆరోపణలు రావడం మంచిది కాదు. మీలో చిత్తశుద్ధి ఉంటే, అవినీతి జరగలేదనుకుంటే , నిజాయితీ ఉంటే, పొరపాటు జరగలేదనుకుంటే, టెండర్ డాక్యుమెంట్స్ మార్చలేదనుకుంటే .........

**మేడమ్ డిప్యూటీ స్పీకర్‌:–** గంటా ఐదు నిమిషాలు సమయం ఇచ్చాను. సబ్జెక్ట్ అంతా చెప్పారు. సబ్జెక్ట్ రిపీట్ అవుతోంది. పదే పదే చెప్పినా కంక్లూడ్ చేయడం లేదు. అపోజిషన్ తరపున సమయం అంతా మీరే మాట్లాడితే ఎలా? వేరే సభ్యులున్నారు. డిమాండ్సులో మీరు చెప్పండి. ఒక సభ్యునికే గంట సమయం ఇస్తే మిగతా సభ్యులు ఎప్పుడు మాట్లాడాలి.

**శ్రీ వై. అంజయ్య:–** 2017–18 సంవత్సర బడ్జెట్‌పై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

**మేడమ్ డిప్యూటీ స్పీకర్‌:–** సభ్యునికి కేటాయించిన సమయంలోనే మాట్లాడాలి.

1.10 మ. **శ్రీ జి. కిషన్ రెడ్డి :** – నేను బడ్జెట్‌పై మాట్లాడడానికి ఇనీషియేషన్ తీసుకున్నాను. మనం బీఏసిలో ఏమి నిర్ణయం తీసుకున్నాము?

**మేడమ్ డెప్యూటి స్పీకర్ : –** సమయం కూడా చూసుకోవాలి. మీకు ముప్పై నిమిషాల సమయం కేటాయించడం జరిగింది. మొత్తం సమయం మీరే మాట్లాడతానంటే ఎట్లా? మీకు కేటాయించిన సమయాన్ని మీరు సద్వినియోగించుకోవాలి. పద్దులపై మాట్లాడేటప్పుడు మళ్లీ ఇంకేదైనా మాట్లాడండి. ఎంత రిక్వెస్ట్ చేసినప్పటికీ మీరు వినకపోతే ఎట్లా?

**శ్రీ జి. కిషన్ రెడ్డి : –** అధ్యక్షా, రాష్ట్రంలో అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎం.ఎస్.ఎం.ఈ ఏ రకంగా ఉందన్న విషయమై ప్రభుత్వం ఆలోచించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎం.ఎస్.ఎం.ఈకి సంబంధించిన యూనిట్లు మూతపడ్డాయి. అది ఎవరి పొరపాటు? ఎం.ఎస్.ఎం.ఈ అంటే మైక్రో స్మాల్ మీడియం ఎంట్రప్రెన్యూర్స్ అధ్యక్షా. 6844 ఎం.ఎస్.ఎం.ఈ యూనిట్లకు గాను తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 3065 యూనిట్లు మూతపడ్డాయి. ఇప్పుడు కేవలం 3779 యూనిట్లు మాత్రమే ఉన్నాయి. ఇన్వెస్ట్‌మెంట్స్‌కి సంబంధించి రూ.3000 కోట్లుండగా, ఇప్పుడు యాభై శాతం తగ్గిపోయింది. సోషియో ఎకనామిక్ సర్వేలోని పేజ్ నెం.73లో ఉంది. ఇది నేను చెబుతున్నది కాదు. ఈ విషయమై ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రభుత్వం, బడ్జెట్ విషయంలో, ప్రజలకిచ్చిన హామీల విషయంలో కచ్చితంగా జవాబుదారీతనంగా ఉండాలి.

అధ్యక్షా, ఇరిగేషన్‌కి సంబంధించి నేను కాగితాలు ఇచ్చాను. టెండర్ ఎవాల్యుయేషన్ డాక్యుమెంట్లు మీ దగ్గర పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. రాష్ట్ర బడ్జెట్, వాస్తవాలను ప్రతిబింబించాల్సిందిపోయి ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉంది. మనది ధనిక రాష్ట్రమని చెబుతున్నారు. కీలక రంగాలకు కేటాయించిన నిధులు ఖర్చుచేయలేకపోతున్నాము. ఈ విషయమై ఒకసారి ఆలోచించమని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. చేతలేమో చేదుగా ఉన్నాయి, మాటలేమో తీపిగా ఉన్నాయి. మాటలు కోటలు దాటుతున్నాయి అధ్యక్షా. చేతలు గడప దాటడం లేదు. నేను నిర్మాణాత్మక సూచనలు చేశాను. బడ్జెట్ విషయంలో తప్పులను సరిదిద్దాలని, వాస్తవాలను గమనించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ సెలవుతీసుకుంటున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్ : –** అధ్యక్షా, కిషన్‌రెడ్డి గారు చాలా సీనియర్ శాసనసభ్యులు. మీరు అప్పులు చేస్తున్నారు అని పదే పదే అంటున్నారు. అప్పులు చేయకుండా ఆసుపత్రులు బాగవ్వాలి, రోడ్లు బాగవ్వాలి, ఇళ్లు కట్టాలి అంటే ఎట్లా? రాష్ట్రప్రభుత్వం డబ్బులు మొబిలైజ్ చెయ్యకుండా ఇన్ని రకాల కార్యక్రమాలను చేయగలదా? ఎంత అశాస్త్రీయంగా మాట్లాడుతున్నారో! మీరు అర్బన్ ఏరియా ఎం.ఎల్.ఏ. రైతులను అడిగితే కరెంట్, రోడ్ల గురించి తెలుస్తుంది. తప్పకుండా వారిని అడుగుదాము. మీరు మిగిల్చిన విషాదాన్ని రెక్టిఫై చేయడం కష్టం అవుతోంది. గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పండి. గ్రామాలకు రండి. రోడ్లు, స్కూల్స్, హాస్పిటల్స్ పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తుంది. దేశంలో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం ఏదంటే తెలంగాణ రాష్ట్రం అధ్యక్షా. వాటర్‌గ్రిడ్ ప్రోగ్రామ్ ప్రపంచంలో ఎక్కడా లేదు. సౌరాష్ట్ర ప్రాంతంలో ఉంది. తెలంగాణ పల్లెలకు, తెలంగాణ గూడాలకు, లంబాడి తాండాలన్నింటిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాము అధ్యక్షా. రూ.35-40 వేల కోట్లు ఖర్చుపెట్టి దేశానికే ఆదర్శంగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలిచింది. జీవన్‌రెడ్డి గారు పల్లెలకు పోదాం అంటున్నారు. వారు ఆర్ అండ్ బీ మంత్రిగా పనిచేశారు. వారి హయాంలో ఎంత డబ్బు ఖర్చుపెట్టారు? ఈ ప్రభుత్వం ఆర్ అండ్ బీ రోడ్లకు ఎంత డబ్బు ఖర్చుపెట్టింది ? ఒక్క ఊరిలో కూడా సీసీరోడ్లు, డ్రైనేజ్‌లను, ఆర్ అండ్ బీ రోడ్లను వెయ్యలేదు. అటువంటి పరిస్థితులను సరిచేసే క్రమంలో తెలంగాణ రాష్ట్రం ఉంది. అందుకోసం డబ్బులు మొబిలైజ్ చేశాము. అప్పు చేసి పప్పు కూడు తింటున్నారు అన్న ధోరణిలో మాట్లాడడం తగదని మనవిచేస్తున్నాను.

**శ్రీ వై. అంజయ్య : –** అధ్యక్షా, 2017-18 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌పై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ బడ్జెట్‌ను చూసి మేధావుల నుండి గ్రామీణ ప్రాంత ప్రజల వరకూ హర్షాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఏదో థియరీ చదివి బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదు. ప్రాక్టికల్, గ్రామీణప్రాంతాలు తిరిగి, స్థానిక సమస్యలను తెలుసుకొని, అన్ని అవగాహన ఉన్న వ్యక్తులు ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ అందరి మన్ననలు పొందినది. గౌరవ ముఖ్యమంత్రి గారు, భారతదేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ రంగాన్ని ముందుకు తీసుకెళ్లారు.

**1.20 మ.** మన రాష్ట్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఇతర రాష్ట్రాలు కూడా మెచ్చుకున్నాయి. అదే విధంగా ప్రధానమంత్రిగారు కూడా మన ప్రభుత్వ పనితీరును చూసి మెచ్చుకున్న సందర్భాలు అందరికీ తెలుసు. బడ్జెట్ కేటాయింపులు అంచనాల మేరకే కేటాయిస్తారు. అంత మాత్రాన ప్రతి ఒక్కటీ అంకెలను చూసి మాట్లాడటం కరెక్ట్ కాదు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఏ విధంగా జరుగుతున్నాయి, ఏ విధంగా సంక్షేమ పథకాలు

అమలవుతున్నాయో గౌరవ సభ్యులు ఆలోచించాలి. ఇందాక గౌరవ సభ్యుడు మాట్లాడుతూ ఈ బడ్జెట్ బడాయి బడ్జెట్, అంకెల గారడీ బడ్జెట్ అని అన్నారు.

ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమానికి సంబంధించి ఏ విధంగా చర్యలు చేపడితే బాగుంటుందనే ఉద్దేశంతో సకల జనుల సర్వే జరిగినప్పుడు చాలామంది అనుకున్న మాటేమిటంటే ఉన్న పెన్షన్‌లను, ఆహార భద్రత కార్డులను తీసేయడానికి ప్రభుత్వం సర్వే చేస్తున్నదని ప్రచారం చేశారు. కానీ గత పాలకుల సమయంలో 29 లక్షల పెన్షన్‌లు ఉంటే ఇప్పుడు మొత్తం 36 లక్షల మంది పేద ప్రజలకు పెన్షన్‌లను మా ప్రభుత్వం ఇస్తున్నది. అంతే కాకుండా గత పాలకులు మనిషికి నాలుగు కిలోల బియ్యం ఇస్తే ఇప్పుడు మా టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబ సభ్యుడికి ఆరు కిలోల బియ్యం ఇస్తున్నది. వృద్ధులకు, వితంతువులకు రూ.1000 పెన్షన్, వికలాంగులకు రూ.1500 పెన్షన్ ఇస్తుంటే ఇది అంకెల గారడీనా అని అడుగుతున్నాను? గతంలో వృద్ధులు నిరాదరణకు గురయ్యారు. ఎందుకంటే కన్న కుమారుడు అన్నం పెట్టలేని పరిస్థితి ఉండేది. అంతే కాకుండా అన్నదమ్ముల మధ్యన పోటీ ఉండేది. కానీ ఇప్పుడు వృద్ధులకు నెలకు రూ.1000 పెన్షన్ వస్తున్నందున ఆ అన్నదమ్ములే తల్లిదండ్రులను చూసుకుంటామని పోటీపడుతున్నారు.

ఏది ఏమైనప్పటికీ మనది కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ ఇంత పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే అందరూ సంతోషించాలి. చాలామంది ప్రతిపక్ష సభ్యులు ఇంకేదో అభివృద్ధి చేయలేదని అన్నారు. అంటే ఒక్క రాత్రికే అన్ని పనులు పూర్తవుతాయా అని అడుగుతున్నాను? గత పాలకులు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలేమిటి? టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గత మూడు సంవత్సరాల నుంచి జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలేమిటనేది అందరూ ఒకసారి ఆలోచించాలని కోరుతున్నాను.

సకల జనులు తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలు చేశారు, వారికేం చేశారని అన్నారు. ఉద్యోగులు సకల జనుల సమ్మెలో పాల్గొన్నారు కాబట్టే వీఆర్ఏ నుంచి అంగన్‌వాడీ టీచర్ల నుంచి చప్రాసి నుంచి చీఫ్ సెక్రటరీ వరకు ప్రభుత్వం జీతాలు పెంచింది. అది అభివృద్ధి కాదా అని అడుగుతున్నాను. కేవలం ఉద్యోగులకే కాకుండా ప్రజాప్రతినిధులు ఆత్మగౌరవంతో పరిపాలన అందించాలనే ఉద్దేశంతో వారి జీతాలు కూడా పెంచారు. సర్పంచులకు రూ.5వేలు, ఎంపీటీసీలకు రూ.5వేలు, ఎంపీపీలకు రూ.10వేలు, జెడ్పీటీసీలకు రూ.10వేలు, జిల్లా పరిషత్ ఛైర్మన్‌లకు రూ.1 లక్ష వరకు పెంచారు. అంతే కాకుండా ఎమ్మెల్యేలకు జీతాలు పెంచినప్పుడు, ఎమ్మెల్యేల పరిధిలో రూ.1 కోటి 50 లక్షల సిడిపి ఫండ్స్ ఉంటే వాటిని మన ముఖ్యమంత్రిగారు రూ.3 కోట్లకు పెంచి ఆ నిధులను ఎమ్మెల్యేలే ఖర్చు పెట్టే విధంగా అధికారమిచ్చినప్పుడు అప్పుడేమో ప్రతిపక్ష సభ్యులు ముఖ్యమంత్రిగారు భోళాశంకరుడు అన్నారు. ఎన్నికలలో డిపాజిట్లు రాకపోతేనేమో కింకరుడు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గారి మీద నమ్మకం ఉన్నందున ప్రజలు ఆయనకు ఓట్లువేసి ప్రతి ఎన్నికల సందర్భంలో గెలిపిస్తున్నారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తుంటే ప్రతిపక్షాలు సహకరించాలి.

మనది కొత్తరాష్ట్రం అయినప్పటికీ ఇంత తొందరగా అంటే కేవలం మూడు సంవత్సరాల కాలంలో అధికార వికేంద్రీకరణ జరగాలని, ప్రజలకు పరిపాలన అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో జిల్లాల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతం చేశారు. గతంలో గౌరవ సభ్యులు జీవన్ రెడ్డిగారు ఆర్ అండ్ బి శాఖామంత్రిగా పనిచేశారు. గత 60 సంవత్సరాలలో ఒక గ్రామ పంచాయతీలో కూడా బిటి రోడ్డు లేదు. కమ్యూనికేషన్ ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గత పాలకులు గ్రామ పంచాయతీలకు బిటి రోడ్లు వేయకపోయినా టీఆర్ఎస్ ప్రభుత్వం బిటి రోడ్ల రెన్యువల్‌కి ఎన్ని కోట్ల రూపాయిలు వెచ్చించింది, కొత్తగా ఎన్ని రోడ్లు వేశారనేది లెక్కలు చెప్పమంటే నేను అంకెలతో సహా చెప్పగలను. కాబట్టి మా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు సహకరిస్తే బాగుంటుంది. గతంలో గ్రామాల నుండి రైతులు పండించిన కూరగాయలు గానీ ఇతర వ్యవసాయ ఉత్పత్తులను గానీ మార్కెట్‌కి తీసుకెళ్లాలన్నా రోడ్లు సరిగా ఉండేవి కావు.

మిషన్ కాకతీయ కార్యక్రమం కింద గ్రామాలలోని చెరువులు నిండిన గ్రామస్థులకు వాటి ఫలాల విలువ తెలుస్తుంది. ఇంత మంచి కార్యక్రమం గురించి గత పాలకులు ఎప్పుడైనా ఆలోచించారా? గతంలో ఒక చెరువు మంజూరు కావాలన్నా లేదంటే ఒక చెరువుకు గండి పడితే, ఒక తూము పోతే, అలుగు పోతే కేవలం ఒకటో, రెండో మంజూరిచ్చేవారు. కానీ ఇప్పుడు ఒకేసారి ప్రభుత్వం వందల సంఖ్యలో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేపడుతున్నది. ఒక చెరువు నిండితే దానివల్ల వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, పశువులకు నీళ్లు వంటివి అన్ని రకాలుగా ఉపయోగముంటుంది.

కొంతమంది సభ్యులు మిషన్ భగీరథ అవసరమేంటని అన్నారు. మిషన్ భగీరథ అవసరమా లేదా అనేది మా షాద్‌నగర్ నియోజకవర్గానికి వస్తే తెలుస్తుంది. మా దగ్గర వెయ్యి ఫీట్లు బోర్‌వెల్ వేసినా నీళ్లు

రావడం లేదు. ఇక ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టులు కడితే తప్పు అన్నట్లుగా ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయి. ప్రాజెక్టులు లేకపోతే మా ప్రాంతం ఎడారిగా మారిపోతుంది. ప్రాజెక్టులను ప్రజల అవసరాలకు సరిపడా రీడిజైన్ చేయడంలో తప్పేమున్నదని అడుగుతున్నాను. ఏది ఏమైనప్పటికీ ఈ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని ప్రతిపక్షాలను కోరుతున్నాను. ఎందుకంటే పక్క రాష్ట్రాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేటప్పుడు అన్ని పార్టీలు ఒకటవుతాయి. మన దగ్గర కూడా ఆ సోయి తెచ్చుకోవాలని కోరుతున్నాను.

నా చిన్నప్పుడు బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే ఏ వస్తువుల మీద ఎంత ట్యాక్సులు పెంచుతారోనే భయంతో కొంతమంది టీవీలు మరియు ఇతర గృహోపకరణ వస్తువులను ముందుగానే కొనుగోలు చేసేవారు. కానీ ఈ ప్రభుత్వం నాలుగుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ వేయకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం హర్షనీయం. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది, గ్రామీణ ప్రాంతంలోని సమాజం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కులవృత్తులను ఏర్పాటుచేశారు. వృత్తులను బట్టి కులాలకు పేరు వచ్చింది. నిజంగా ఆ కులాలను అభివృద్ధి చేయాలంటే ఆ కులానికి సంబంధించిన ఆలయాలను అభివృద్ధి చేయాలి. చేతివృత్తులకు సంబంధించి వారి పనిముట్లే వారికి దైవంతో సమానం. కాబట్టి ప్రభుత్వం వారికి పెద్దఎత్తున బడ్జెట్‌లో నిధులను కేటాయించి వారి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నది. గతంలో కొత్త సంవత్సరం పండగరోజున ఆ పనిముట్లకు ముందుగా పూజచేసేవారు. కానీ ఇప్పుడు యాంత్రికీకరణ పద్ధతి వచ్చింది. మట్టి కుండలు మాయమయ్యాయి. కుమ్మరివారు కుండలు చేయకపోతే వారి జీవనోపాధి ఎలా గడుస్తుంది? వడ్ల, కుమ్మరులకు కూడా పనిలేదు. కమ్మరి వాళ్లకు కూడా పనిలేకుండా పోయింది. వీరి కుటుంబాలు చాలా దయనీయమైన పరిస్థితులలో ఉన్నాయని మన గౌరవ ముఖ్యమంత్రిగారు క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ కులవృత్తులను ప్రోత్సహిస్తేనే సమాజం బాగుపడుతుందనే ఉద్దేశంతో అన్ని కులవృత్తులకు నిధులు కేటాయించి వారిని అభివృద్ధి చేయాలని ఆలోచించినందుకు ముఖ్యమంత్రి గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

మరీ ముఖ్యంగా సమాజం బాగుపడాలంటే విద్యపరంగా అభివృద్ధి చెందాలి. విద్యాపరంగా అభివృద్ధి చెందడానికి బిసిలకు 119, ఎస్.సిలకు, ఎస్.టిలకు, మైనారిటీలకు రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించి ధనికుని పిల్లవాడు పేదవాడి పిల్లవాడు ఒకే రకమైన నాణ్యమైన విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో విద్యార్థుల నైపుణ్యాన్ని, మేధాశక్తిని బట్టి, వారి ప్రతిభను బట్టి రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రత్యేక శిక్షణను ఏర్పాటు చేస్తున్నది. ఇందాక ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతూ కేజీ లేదని పీజీ లేదని అన్నారు. ముఖ్యమంత్రిగారి ఉద్దేశమేమిటంటే 1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలను అంగన్‌వాడీ స్కూళ్లతో అనుసంధానంచేసి చదివిస్తే విద్యార్థులు వాళ్ల తల్లిదండ్రుల ప్రేమానురాగాలు పొందగల్గుతారు. అనంతరం ఆ విద్యార్థులను 5వ తరగతి నుంచి రెసిడెన్షియల్ పాఠశాలలో చదివించాలనేది మన గౌరవ ముఖ్యమంత్రి గారి ఉద్దేశం.

**1.30 మ.** అది తప్పకుండా అవుతుంది. ఆ విషయమై మీరందరూ సహకరించాలి. ముఖ్యమంత్రి గారు ఈ రకంగా మంచి పనులు చేస్తారని ఎవరూ ఊహించలేదు. ముఖ్యమంత్రి గారు బ్రహ్మాండంగా మంచి పనులు చేస్తున్నారని ప్రజలందరి మనస్సుల్లో ఉంది. ప్రజలందరూ బడ్జెట్ అంటే ఈ విధంగా ఉంటుందా, మా కులాలకూ బడ్జెట్ ఉంటుందా, అని గ్రామీణ ప్రజలు సంతోషంతో సంబురాలు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రజల వృత్తులకు డబ్బులు ఇచ్చి వాళ్ల వృత్తులను అభివృద్ధి చేస్తామంటే తెలంగాణ ప్రజలు అవగాహనతో అర్థం చేసుకొని సంతోషపడుతున్నారు. గతంలో ఉత్తమ వ్యాపారి కనిష్ట చాకిరి అనే వాళ్లు కానీ ప్రస్తుతం అది ఉల్టా అయింది. గతంలో రైతులు ఖరీఫ్ పంట వస్తుందంటే విత్తనాలు మరియు ఎరువుల కోసం రేయింబవళ్లు వరుసల్లో నిలబడే వాళ్లు, ఏదైనా పని కోసం వరుస నుంచి బయటికి వెళ్తే వారి చెప్పులను వరుసలో ఉంచి వెళ్లే వారు. ఎరువుల కోసం లాఠీ ఛార్జీలు, అనేక రకాల ఇబ్బందులు ఎదురయ్యేవి.

ఆముదాలు, కుసుమ, మిర్చి మొదలైన వాణిజ్య పంటలు పండించిన వారి నుంచి ముక్కు పిండి ట్యాక్సులు వసూలు చేసిన మీ కాంగ్రెస్ పార్టీ వారు ఈ రోజు వ్యవసాయం గురించి మాట్లాడితే ఎలా అని జగిత్యాల ఎమ్మెల్యే గారికి మనవి చేస్తున్నాను. వ్యవసాయదారులు బాగుపడాలని మిషన్ కాకతీయ ద్వారా ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. గతంలో వ్యవసాయదారులెవరూ వ్యవసాయం చేసి బాగుపడలేదు, పండిన పంట ద్వారా లాభం వచ్చి ఏ వ్యవసాయదారుడూ తాలుకాలో, పట్టణంలో ఇల్లు కట్టిన పరిస్థితి లేదు. రైతులు పెట్టుబడి పెట్టినా, సరైన వర్షాలు, సరైన పంట రావాల్సిన అవసరం ఉన్నది. సకాలంలో వర్షాలు రాకపోవడం మరియు ఇతరత్రా కారణాల వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. నీటి పారుదల శాఖ మంత్రి గారే స్వయంగా ప్రాజెక్టులను రేయింబవళ్లు

పర్యవేక్షించినందునే మా పాలమూరు జిల్లాలోని కొల్లాపూర్, నాగర్ కర్నూల్, వనపర్తి మొదలైన ప్రాంతాల్లో చెరువులు నిండి మేము ఆనందంగా ఉన్నాము. గతంలో మా ప్రాంతంలో పశువులకు మేత, తాగడానికి నీళ్లు ఉండేవి కావు. ఆ ప్రాజెక్టులు కూడా మా ప్రాంతానికి రావాలని కోరుతున్నాము. కానీ, ఈ రోజు మేము సంతోషంగా ఉన్నాము. వసతి గృహాల్లో మరియు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టడం వల్ల విద్యార్థుల సంఖ్య మరియు హాజరు శాతం పెరిగింది. ప్రస్తుతం తెలంగాణలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాము. మొదటగా పోలీసు శాఖ విషయమై చర్చిద్దాము. గతంలో పోలీసు స్టేషనుకు వెళ్తే జీపుల కోసం మరియు స్టేషనరీ కోసం డబ్బులు ఖర్చు జరిగేవి. కానీ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ప్రజలపై ఆర్థిక భారం పడకుండా పారదర్శకమైన పని తీరుకై మండల పోలీసు స్టేషనుకు నెలకు రూ.25,000 మరియు పట్టణ పోలీసు స్టేషనుకు నెలకు రూ.50,000 చొప్పున నిధులను విడుదల చేస్తున్నారు. ఏ ప్రాంతానికి, ఏ కులానికి ఏమి చేస్తే మేలైన అభివృద్ధి జరుగుతుందనే విషయమై ముఖ్యమంత్రి గారికి సంపూర్ణ అవగాహన ఉంది. ప్రజా సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్నందున మన తెలంగాణ బంగారు తెలంగాణ అవుతుంది. తెలంగాణ రాష్ట్రం వచ్చే నాటికే మేజర్ ప్రాజెక్టులన్ని పూర్తైతే మన తెలంగాణ చాలా అభివృద్ధి చెందేది. కానీ, మీరెందుకు ఆ విధంగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేయలేదు. ప్రాజెక్టులు పూర్తైతే మాకు నీళ్లెందుకు రాకపోయేవి, పాలమూరు ప్రజలు వలసలు ఎందుకు పోయేవారు, ఈ కార్యక్రమాలన్ని చేసుంటే తెలంగాణ గొప్పగా అభివృద్ధి జరిగేది. తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణగా మారడానికి సహకరించాలని, తగు సూచనలు ఇవ్వాలని మీ అందరిని కోరుతున్నాను.

MADAM DEPUTY SPEAKER: The House is adjourned to meet again at 10.00 AM tomorrow.

(The House then adjourned at 01.36 PM to meet again at 10.00 AM on Thursday, the 16th March, 2017.)

**“Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad.”**